

# కేటలిస్టు

ఆదిశేషువుకి వెయ్యి నాలిక లున్నాయట! కాని. జానకిరామయ్యగారి ధర్మపత్ని ఆదిశేషమ్మగారికి వెయ్యిన్నొక్క నాలిక లున్నాయని ఆ ఇంట్లో నౌకరు మస్తాను నడిగితే చెబులాడు. "ఆ ఒక్క నాలిక ఎక్కువెలా వచ్చిందిరా?" అని ఎవరయినా వాణ్ణి వ్యంగ్యంగా అడిగితే— "మరి అ జానకిరామయ్య బాబు నాలి కేటయిపోనాది?" అని ఎదురుప్రశ్న వేస్తాడు. అంతేకాదు, జానకిరామయ్యగారితో మాట్లాడేటప్పుడు—సామీ! మీరు మరీ నాలిక లేని మనిషి బాబూ!" అనెయ్యగల చనువు, ధైర్యం

ఆయన దగ్గర వాడికున్నాయి. అయితే, మస్తాను ఆ మాటలు అన్నప్పుడు జానకిరామయ్యగారు క్లెయింట్ ఈస్ట్‌వుడ్‌లా ముఖం పెట్టి, వివేకానందునిలా నవ్వుతారు. "మరీ నీవో అఘాయిత్యం మాటలు కాని, నోట్లో నాలిక లేక పోతే కవర్లమీద స్టాంపులు ఎలా అతికిస్తున్నావురా?" అంటారు. మస్తాను ఆ మాటలు అర్థంకాక తెల్లబోయి చూస్తాడు.

వీళ్ళ ముగ్గురి గురించీ చెప్పి, కథానాయిక లలిత గురించి చెప్పక పోవటం అన్యాయమే అవుతుంది.

అలనాటి ప్రబంధ నాయిక వరూధినిని నేను చూడలేదు కాని, నా వూహ ప్రకారం — పర్వత సానువుల్లో విహరిస్తున్న వరూధినిని బలవంతంగా గుంటూరు దగ్గరలోని ఆ పల్లెటూరుకు తీసుకొచ్చి, ఆమె కట్టుకున్న జిలుగు వస్త్రాలను వూడబెరికి ఫుల్‌వాయిల్ చీర కట్టబెట్టి, మెడలోని ఆభరణాలన్నీ తీసేసి సింపుల్‌గా ఒక లాకెట్ వేసి, చెవులకు ముత్యాల డ్రాప్స్ తగిలించి వాల్జడ వేస్తే — అందంలో మాత్రం సరిగా లలితలాగే వుంటుందనుకుంటాను.

* * *

గుంటూరు జిల్లాలో ఎండలు చాలా దారుణంగా ఉంటాయని వినటమేకాని, విశాఖపట్నంలో పుట్టి పెరిగిన నాకు ఆ విషయం చాలా ఆలస్యంగా అనుభవానికొచ్చింది. కాలేజీలో ఇంజనీరింగ్ డిప్లొమా పూర్తిచేసుకొని మొట్టమొదటిసారిగా గుంటూరు జిల్లాలోని ఆ పల్లెటూరు వెళ్ళాను. మండువేసవిలో, మధ్యాహ్నం పన్నెండు గంటల ప్రాంతంలో బస్సు నన్ను రోడ్డుమీద దింపేసి నిర్దాక్షిణ్యంగా దుమ్ము రేపుకొంటూ ముందుకు సాగిపోయింది. సాగిపోయిన బస్సులూ, మండిపోతున్న ఎండనూ క్షణంసేపు చూసి నిట్టూర్చి చేతిలోని సూట్‌కేస్‌తో రోడ్డుకు ఆనుకొని ఉన్న చిన్న పాకహోటల్లో ప్రవేశించాను. అయితే, అది చిన్నహోటలు కాదనీ, ఆ వూరికి చిన్న, పెద్ద ఏకైక హోటలు అదేననీ తరవాత నాకు తెలిసింది.

రుమాలుతో ముఖంమీది చెమటను ఒత్తుకుంటూ హోటలు అంతా

కలయచూశాను. పాకలో ఒకవారగా తినుబండారాలు పేర్చే బీరువా దాని రంగును కోల్పోయి నల్లని మొరడులా నిలబడి ఉంది. అది పూర్వాశ్రమంలో అద్దాల బీరువా అని తెలియటానికి చిహ్నంగా పగిలిన ఒక అద్దం పెంకుమాత్రం తలుపుమీద నిలిచి ఉంది. బీరువాలోని మూడు అరల్లోనూ రెండు మూడు ఖాళీప్లేట్లు, పొట్లాలు కట్టే ఆకులు, దారంరీలు తప్ప తినుబండారాలేమీ లేవు.

వంట గదిలోనికి సర్వరు వెళ్ళటానికీ, లోపలి పొగ బయటకు రావటాకీ బీరువా వెనకగా ఒకదారి ఉంది. ఆ పాకలో కాళ్ళు విరిగిన నాలుగు టేబిల్సు, ఏడెనిమిది బెంచీలు చెదురు మదురుగా పేర్చబడి ఉన్నాయి. పొగచూరిపోయిన రెండు రాటలకూ ఉరిపోసినట్లు వెంకటేశ్వర స్వామి బొమ్మ, లక్ష్మీదేవి బొమ్మ తగిలించబడి ఉన్నాయి. ఆ పాటలు రెండూ గాలికి ఇటూ అటూ వూగి వింత శబ్దం చేస్తున్నాయి.

ముందుగా మంచినీళ్ళు, తరవాత కాఫీ తీసుకురమ్మని సర్వరుకు చెప్పాను.

"మన దే వూరు సామీ?"

పక్క బెంచీమీద కూర్చుని టిఫిన్ తింటున్న కుర్రాడివేపు చూశాను. అతనికి సుమారు పదమూడేళ్ళు ఉంటాయి. అతని ముఖం నల్లగా వున్నా అందంగా ఉంది. అతని కనులు మరీ అంత పెద్దవి కాకపోయినా, స్వచ్ఛంగా ఉన్నాయి. అతను వేసుకున్న దుస్తులు చిరిగినవే అయినా మాసిపోయిలేవు. గాలికి అల్లరిగా రేగి నుదుటమీద పడుతున్న ఉంగరాల జుత్తే అతని ముఖానికి అందం చేకూర్చిందని అనుకున్నాను.

నా సమాధానంకోసం టిఫిన్ తినటం ఆపి ఆత్రంగా నావంక చూస్తున్నాడు.

"వైజాగ్" అన్నాను.

"వౌయిజాగు అంటే విశాఖపట్నమేనా, సామీ?" అన్నాడు.

అతడి మాటలకు నవ్వుకుంటూ అవునన్నట్లు తల వూపాను.

"ఇక్కడెవరేనా బంధుగు లున్నారా?"

ఇంకొక సమయంలో ఇలాటి ప్రశ్నలకు సమాధానం చెప్పాలంటే నిజానికి నాకు చిరాకు కలిగి ఉండేది. కాని, నాకీ ప్రాంత కొత్త. ఇదే ప్రథమంగా రావటం. ఊళ్ళో కనీసం చిన్న లాడ్జి అయినా దొరకక పోతుందా?" అనే ధైర్యంతో వచ్చేశాను కాని, ఈ ఊళ్ళో దిగి పరిస రాలు పరికించాక ఆ ఆశ కాస్తా హరించిపోయింది.

ఇప్పుడు ఈ గ్రామంలో నేనొక చిన్న గది సంపాదించుకోవాలి లేకపోతే రోజూ సాయంత్రం గుంటూరు వెళ్ళి ఉదయాన్నే వస్తూ ఉండాలి. గ్రామ స్థులతో పరిచయం నా కిప్పుడు ఎంతయినా అవసరం. అదీకాక, ఆకుర్రాడు అడిగే తీరులోని నమ్రత, కంఠంలోని కుతూహలం గమనించాక అత నికి ఓపికగా సమాధానాలు చెప్పాలనిపించింది. సర్వరు తెచ్చిన మంచి నీళ్ళు గటగటా త్రాగేసి ఖాళీ గ్లాసు టేబిలు మీద ఉంచుతూ అన్నాను.

"బంధువు లెవళ్ళూ లేరు కెనాల్సు ఆఫీసులో ఉద్యోగం అయింది! అందుకని వచ్చాను. ఆ ఆఫీసు ఎక్కడుందో తెలుసా?"

అతని ఎడల నేను ఆమాత్రం శ్రద్ధచూపించటంతో అతని ముఖం లో ఆనందం తొంగిచూసింది.

"అయితే, మీరు కాలవలోళ్ళన్నమాట!" అన్నాడు.

కాలవలోళ్ళంటే నాగార్జున్‌సాగర్ కెనాల్సులో ఉద్యోగం చేస్తున్న వాళ్ళని అర్థం కావటానికి నాకు కొన్ని నిమిషాలు పట్టింది. తరవాత అతని పరిభాషకు నవ్వొచ్చింది.

"తొందరగా కాఫీ తాగు, సామీ! నేను తీసుకపోతాను! అది మా ఈదిలో ఉన్నాది" అన్నాడు.

నేను కెనాల్సు ఉద్యోగినని తెలిశాక వాడి చూపుల్లో నా ఎడల భక్తి పెరిగిపోయింది.

కాఫీ తాగుతున్నాను.

"గట్టయితే సామీ! మా ఊరికి పొగరు నీళ్ళు ఎప్పుడొస్తాయంట?" అన్నాడు.

"ఏమో, నాకు తెలియదు. ఆఫీసులో చేరితేకాని ఆ విషయాలేవీ తెలియవు. ఇంతకూ నీ పేరేమిటి?"

"మస్తాను! మా యమ్మకి నా కంటె ముందు పది మంది పుట్టి పోయినారంట! నేను బతికి బట్టకడితే మస్తానయ్య పేరెట్టు కుంటానని మాయమ్మ మొక్కుకున్నాదంట!" అన్నాడు.

"చూడు, మస్తానూ! అద్దెకు ఈ ఊళ్ళో గది ఏదయినా దొరుకు తుందా?" అన్నాను!

"మా శేషమ్మగారింట్లో గది ఖాళీగానే ఉందిగందా? ఈ మధ్యనే మాధవరావు సూపరువోయిజరు ఖాళీచేసి వెళ్ళిపోయినాడు. ఆయనకి రాజ మండ్రం ట్రాన్సుఫరు అయిపోనాదంట!

మస్తాను యాసతో మాట్లాడుతూ ఉంటే వినటానికి నాకెంతో మధురంగా ఉంది. ఆ మాధుర్యం నిజానికి అతని యాసలో లేదు. గొంతులో ఉంది.

"మరి ఆ గది అద్దెకు ఇస్తారా?"
"ఓ!" అన్నాడు ధైర్యంగా.

నాకు గుండెల మీదనుంచి ఏదో పెద్ద బరువు దింపుకున్నట్లయింది. ఆ క్షణంలో మస్తాను నా కంటికి ఆపద్బాంధవుడిలా కనుపించాడు.

కాఫీ తాగడం ముగించి, మస్తాను బిల్లుకూడా నేనే చెల్లించాను. అందుకు అతడు చాలా మొహమాటం పడ్డాడు. నేను వద్దంటున్నా విన కుండా నా సూట్‌కేస్‌ను భుజాన పెట్టుకుని బయల్దేరాడు. దారిలో అనేక విషయాలు నేను అడక్కుండానే చెలాకీగా చెపుతూ నడిచాడు.

శేషమ్మ గారింటిలో అతడు నౌకరుగా పనిచేస్తున్నట్లు, అతని ఆలనా పాలనా అన్నీ వాళ్ళే చూసుకుంటున్నట్లు అతని మాటలలో నాకర్థ మయింది.

కథా నిలయం

శేషమ్మగారి భర్త ఏం చేస్తూ ఉంటారు?" అన్నాను మస్తానుతో.

"ఆ బాబుకేటి మహారాజులాగ పక్కేసుకుని చుట్ట కాల్చుకుంటూ వీథొరండాలో కూరుసుంటారు. అజమాయిసీ అంతా అయమ్మదే. ఆరికి ఈ సుట్టుపక్కల భూములున్నాయి. పొగాకు నాటడం లగాయితు అమ్మటం వరకూ అంతా ఆవిడే చూసుకొంటారు" అన్నాడు,

"అదృష్టవంతుడు —" అనుకున్నాను మనసులో.

అనుకోవటమే కాదు, ఆమాటే పైకికూడా అనేశాను.

"ఆ బాబు అదురుష్టవంతుడే కాని. ఆయమ్మ జులుం జాస్తి బాబూ!" అన్నాడు.

మస్తానువైపు ఆశ్చర్యంగా చూశాను.

"వాళ్ళకి పిల్లలు లేరా?" అన్నాను.

"ఒక్కతే అమ్మాయిబాబూ! లలితమ్మగోరు. రాజమండ్రం కాలేజీలో చదివి నిరుడే ఇంటికొచ్చేసినారు. ఎప్పుడూ ఏయో పుస్తకాలు చదుకోటం తప్ప ఆయమ్మ గట్టిగా నోరయినా విప్పరు. ఆయమ్మ శానా మంచోరులే —"

మస్తాను చెప్పే మాటలు శ్రద్ధగా వింటూ నడుస్తున్నాను. శేషమ్మగారినీ, ఆవిడ భర్తనీ, లలితనూ- వాడు చెపుతూన్న మనస్తత్వాలను బట్టి రూపకల్పన చేసుకుంటున్నాను.

"ఇటుపక్క సందులోకి తిరుగు, బాబూ!... అదిగో, ఆ ఇల్లే!" మస్తాను నాకా ఇంటిని చూపిస్తూ చకచకా నాముందు నడుస్తున్నాడు.

ఆ ఇంటి చుట్టూ రాళ్ళు పేర్చిన ఎత్తయిన ప్రహారీ వుంది. ప్రహారీకి అక్కడక్కడ చేసిన చెక్కుసున్నం బెల్లులు ఊడిపోయి ఉంది. ఇల్లు బాగా పెద్దదే అయినా బాగా పాతదని గోడల్ని బట్టి, పెంకుల్నిబట్టీ తెలుస్తోంది. గేటునుండి లోపలి వరండా వరకూ ముందు చాలా ఖాళీజాగా వుంది. వరండా వరకూ వెళ్ళటానికి కడప నాపరాళ్ళు మెట్లుగా పేర్చారు.

ఖాళీ జాగాలో దక్షిణ తెరిపిన ఒకమూలగా పెద్ద జాజిపందిరి, పందిరి కిందుగా చేమంతి గోలేలు ఉన్నాయి.

వరండాలో వాలు కుర్చీలో కూర్చుని చుట్ట కాల్చుకుంటున్న ముసలాయన నన్ను అదోలా చూసి తరవాత మస్తానువైపు తిరిగి కళ్ళు చిట్లించాడు. మస్తాను నా సూట్‌కేస్ వరండాలో వుంచి ముసలాయన కళ్ళతో అడిగిన ప్రశ్న తనను కాదన్నట్లు లోనికి వెళ్ళిపోయాడు.

"నమస్కారం!" అన్నాడు వరండా మెట్లెక్కుతూ.

ముసలాయన చేతిలోని చుట్ట విసిరేసి, "రండి రండి! అలా కూర్చోండి!" అంటూ ఎదరనున్న పాతస్టూలు చూపించారు.

"నా పేరు కృష్ణమూర్తి. నాగార్జునసాగర్ కెనాల్స్ ఆఫీసులో ఉద్యోగ మయింది. ఈ దినమే చేరాలి. బస్సుదిగి కాఫీ తాగుతూంటే మీ మస్తాను కనుపించేడు. ఈ ఇంట్లో గది ఏదో ఖాళీగా ఉందంటే...."

"అవు న్నాయనా! ఖాళీగానే ఉంది. అద్దె పాతిక రూపాయలు. కానీ తగ్గదు. రాత్రి పది దాటితే కరెంటు కాల్చకూడదు. గదిలో చీట్లపేక ఆడకూడదు. నీ ఇష్టమయితే దిగు. అద్దె మాత్రం ఏ నెలకా నెలఎడ్వాన్సు గానే ఇవ్వాలి...." కంచులాంటి కంఠం విని పక్కకు చూశాను. తలుపు దగ్గర గడప అవతలగా ఆవిడ నిలబడి ఉంది. ఆవిడే శేషమ్మగారని పోల్చుకోవటానికి నాకు ఎంతో సేపు పట్టలేదు. కొద్ది సెకనులు మాత్రమే అవసరమయ్యాయి.

కాస్త స్థూలంగా ఉన్న శరీరం ఆవిడది. భుజాల మధ్య నుండి మొహం పుట్టినట్లు చాలా పొట్టిమెడ. మెడనిండా నగలు. ఆ నగలే లేక పోతే అసలు మెడ కనుపించే అవకాశమే లేదు. చిన్న ముఖంతో వెతికి తేనేకాని కనుపించని చింతాకుల్లాంటి కళ్ళు. ముఖానికీ, శరీరానికీ పొంతన లేదు. ఎవరి ముఖమో తీసుకొచ్చి ఆవిడ శరీరానికి అతికినట్లుంది.

ఆవిడ రంగంలోకి రాగానే ముసలాయనకు తనపాత్ర ముగిసినట్లు వాలు కుర్చీలోకి వాలిపోయారు.

నేను కాస్త తడబడుతూ, "అబ్బే! నాకు చీట్లపేక ఆడే అలవాటు లేదండి. ఇకపోతే- కరెంటు సంగతిమాత్రం కాస్త చిక్కే. నాకు రాత్రి పదకొండు గంటలవరకూ చదువుకునే అలవాటుంది. అదీకాక ఐ. ఏ. పరీక్షలకుకూడా కడదామనుకొంటున్నాను. ఒకవేళ నావల్ల కరెంటు ఎక్కువ కాలితే ఆ డబ్బు నేను ఇచ్చేస్తానండి" అన్నాను.

నాకు పేకాట అలవాటు లేనందుకు ఆవిడ చాలా సంబరపడింది. కరెంటు గురించి మాత్రం కాస్త ఇబ్బందిగా ముఖం పెట్టింది.

సరే, చూస్తానులే. డబ్బుదగ్గర నిక్కచ్చిగా ఉండటం మంచిదని ముందే చెప్పాను—ఏం అనుకోకు నాయనా!" అని, "మస్తానూ, గది తుడిచి సూట్‌కేస్ అందులో పెట్టు" అంటూ మస్తానుకు ఆర్డరు జారీచేసి లోనికి వెళ్ళిపోయింది ఆవిడ.

"బాబూ! మంచినీళ్ళు తాగుతావా? బాగా ఎండపడి వచ్చావు!" అంటూ ఆప్యాయంగా అడిగారు ముసలాయన.

"ఇవ్వండి" అన్నాను.

ఆయన కుర్చీలోంచి లేచి లోనికి వెళ్ళి రాగిచెంబుతో మంచినీళ్ళు తీసుకువచ్చారు. నీళ్ళన్నీ తాగి చెంబు పక్కన ఉంచుతూ ఉంటే— "మరి కొంచెం కావాలా?" అన్నారు.

మంచినీళ్ళకంటే తీయగా ఉంది ఆయన చూపే ఆప్యాయత.

"థాంక్స్! ఇక అక్కరలేదండీ" అన్నాను.

"రండి, బాబూ! గది తుడిచేసేను" అంటూ మస్తాను పిలిచాడు. గదిని కనీసం చూడనయినా చూడకుండా అద్దెకు ఒప్పేసుకున్న నేను, ఆ గదిలోకి వెళ్ళాక నష్టపోలేదనుకున్నాను.

గది బాగా విశాలంగానే ఉంది. లోపల గోడలన్నీ శుభ్రంగానే ఉన్నాయి. దక్షిణంవైపు పెద్ద కిటికీ ఉంది. కిటికీ ఎదుటివైపున పెద్ద అల్మారా ఉంది. ఇంతకు ముందు గదిలో అద్దెకున్నాయన రసికతను చిహ్నంగా "ఫిలిమ్‌ఫేర్" లోని సినీతారల రంగుల బొమ్మలు అక్కడక్కడ గోడలకు అతికించి ఉన్నాయి.

మస్తాను తెచ్చిన సూట్ కేస్ అందుకొని లోపల ఉంచాను.

"మరి నే నెల్తాను సామీ?" ఎందుకయినా కావల్సివస్తే పిలవండి" అన్నాడు మస్తాను.

జేబులోంచి రూపాయి తీసి వాడి చేతులలో ఉంచాను.

"ఎందుకుసామి!" అన్నాడు ఆశ్చర్యంగా మొహంపెట్టి.

"సూట్ కేస్ తీసుకొచ్చావుగా!" అన్నాను.

చాలా మొహమాటపడుతూనే దాన్ని తీసుకున్నాడు.

మస్తానును పంపించి తలుపులు దగ్గరగా పెట్టి కిటికీ తలుపులు తెరిచాను.

కిటికీ అవలవైపు ఆవరణలో పెద్ద మునగ చెట్టుంది. నిండాకాడలు వేలాడుతున్నాయి. కిందవైపు వంగిన కొమ్మలను అందుకొని కాడలు తెంపటానికి చెంగు చెంగున ఎగురుతూంది ఒక అమ్మాయి. కిటికీ తలుపులు తెరిచిన శబ్దం విని నావైపు చూసి తెంపిన కాడలు పట్టుకొని ఇంట్లోకి వెళ్ళిపోయింది. ఆ అమ్మాయే బహుశః లలిత అయి ఉంటుందనుకున్నాను.

* * *

ఆ మధ్యాహ్నం మూడు గంటలకు ఆఫీసుకు వెళ్ళి జాయినింగు రిపోర్టు ఇచ్చాను. అసిస్టెంటు ఇంజనీరుగారు ఉండే ఇంటిలోనే రెండు గదులు "సబ్ డివిజన్" ఆఫీసుగా వాడుతున్నారు. ఆ ఆఫీసులో ఇంకా ఇద్దరు సూపర్ వైజర్లు, ఇద్దరు గుమాస్తాలు, ఆఫీసు ప్యూనులు ఉన్నారు. అందరికీ ఎ. ఇ. గారు నన్ను చూపించి పరిచయం చేశారు.

సాయంకాలం ఆఫీసు నుండి వచ్చిన తరవాత గుంటూరు వెళ్ళి నాకు అవసరమయిన సామానులు అన్నీ కొని తెచ్చుకున్నాను.

రెండు దినాలు గడిచాయి. ఈ రెండు రోజులలోనూ ఆ ఇంటిలో ఆదిశేషమ్మగారి కంఠం తప్ప మిగిలినవాళ్ళ మాటలు నాకు వినబడలేదు.

మస్తాను చెప్పిన మాటలు అతిశయోక్తులు కావని నాకు కొంతవరకు అవగతమయింది.

ఆ రోజు మధ్యాహ్నం మూడు గంటలకు రోడ్డు మీదకు వెళ్ళి కాఫీ త్రాగి వద్దామని షర్టు వేసుకుంటున్నాను.

తలుపు తట్టిన శబ్దమయింది.

వెళ్ళి తలుపు తీశాను.

ఎదురుగా కాఫీ కప్పుతో ఒక అమ్మాయి నిలబడి వుంది. వయసు సుమారు పద్దెనిమిదేళ్ళు వుండచ్చు. కాచిన బంగారు వన్నె దేహచ్ఛాయ ఉదా రంగు చీర, అదే రంగు జాకెట్టు వేసుకుంది. మెడలో పొడుగు గొలుసుతో ఒక లాకెట్ వేలాడుతూంది. చెవులకు ముత్యాల డ్రాప్స్, నుదుట దోసగింజంత తిలకం. చాలా అందంగా ఉంది. నేను వచ్చిననాడు ములక్కాడలు కోసిన అమ్మాయి ఈమే అని పోల్చుకోవటానికి నాకు ఎంతో సేపు పట్టలేదు.

"ఇదేమిటండీ?" అన్నాను.

"కాఫీ!" వంచుకున్న తల ఎత్తకుండానే సమాధానం చెప్పింది.

"ఇప్పుడెందుకండీ-" అన్నాను తడబడుతూ.

"త్రాగటానికి...." మళ్ళీ అదేరకమయిన సమాధానం.

"అబ్బే! మీరెందుకు తెచ్చారని...." నసిగాను?

"అమ్మ పనిలోఉంది. నన్ను తీసుకునివెళ్ళి మీకు ఇచ్చి రమ్మంది. మీరు కాస్త ధారిఇస్తే మీ టేబిలుమీద పెడతాను."

ఇంతవరకూ ఆమెను తలుపుదగ్గరే నిలబెట్టి మాట్లాడుతున్నానన్న సంగతి అప్పుడు నాకు జ్ఞాపకానికి వచ్చింది.

గాభరాగా పక్కకు తప్పుకుంటూ, "సారీ! లోనికి రండి!" అంటూ ఆమెను ఆహ్వానించాను.

ఆమె చిన్నగా నవ్వుతూ కాఫీకప్పు టేబిలుమీద ఉంచింది.

"ఈవేళ నా పుట్టినరోజు" అంది.

"వెరీ గుడ్! అలా చెప్పండి మెనీ హాపీ రిటర్న్స్ ఆఫ్ ది డే!

"థాంక్స్!" అంటూ వెనుతిరిగి వెళ్ళబోయింది.

"అదే! వెళ్ళిపోతున్నారేమిటి? అలా కూర్చోండి!" అన్నాను.

"అమ్మ మామిడికాయలు తరుగుతోంది. సాయం చేయాలి. కాఫీ తాగెయ్యండి. చల్లారి పోతుంది" మాటలు పూర్తయ్యేసరికి తలుపు దగ్గర ఉంది. నేను సమాధానము చెపుదామనుకునేసరికి గదిలోంచి వెళ్ళి పోయింది.

తలుపు దగ్గరగా వేసి లోపలికి వచ్చి కాఫీ తాగాను. అప్పటికే చల్లారిపోయింది. చాలాసేపటివరకూ ఆమెను గురించే ఆలోచిస్తూ ఉండి పోయాను.

కాఫీ ఇవ్వటానికి వచ్చి నన్ను శాసించి కాఫీ తాగించినట్లు అనిపించింది. ఆ తరవాత ఖాళీకప్పు తీసుకువెళ్ళటానికి ఆమె వస్తుందేమోనని చాలా సేపు ఎదురు చూశాను.

ఇంతలో తలుపుదగ్గర శబ్దమయింది.

త్రుళ్ళిపడి చూశాను.

తలుపుదగ్గర మస్తాను! నిలబడి నవ్వుతున్నాడు.

"ఏటి సామీ! అలా తుళ్ళి పడతన్రు?"

"అబ్బే! ఏం లేదు!" అన్నాను.

"తానానికి నీళ్ళు తోడమంటారా?"

"అప్పుడే వద్దు. కాస్త ఎండతగ్గనీ, ఇదుగో, ఈ కప్పు తీసుకెళ్ళి మీ అమ్మగారి కిచ్చెయి" అంటూ కప్పు అందించాను.

వాడు ఆశ్చర్యంగా నావంక చూస్తూ కప్పు అందుకున్నాడు. కాస్త స్వరం తగ్గించి, "శేషమ్మగారు మీకు కాఫీ ఇచ్చినారా?" అన్నాడు. శేషమ్మగారు కాఫీ ఇవ్వటం ప్రపంచంలో ఎనిమిదోవింత అయినట్టు ముఖం పెట్టాడు.

"లేదు, లలితగారిచ్చారు" అన్నాను.

"ఆదీ, అలా చెప్పండి!" అంటూ వాడికేదో అర్థమయినట్టు ముఖం పెట్టి కప్పు పట్టుకొని వెళ్ళిపోయాడు.

తలుపు అవతలినుంచి ఏదో జ్ఞాపకం వచ్చినట్టు తల లోపలికి పెట్టి, "లలితమ్మగోరు శానా మంచోరు బాబూ!" అన్నాడు మెల్లిగా. తరవాత తలుపు దగ్గరగా వేసి వెళ్ళిపోయాడు.

నేను ఆలోచనలో పడ్డాను.

మస్తాను వెళ్ళిపోతూ వెనక్కి వచ్చి "లలిత చాలా మంచి"దని సిఫారసు చేయటంలో అర్థం అవగతం లేకాదు. ఇంతకీ కాఫీ లలిత తీసు కొచ్చిందా? లేక శేషమ్మగారు ఇవ్వమని చెప్పారా? మస్తాను మాటల్ని బట్టి శేషమ్మగారు కాఫీ ఇచ్చేరకం కాదని తెలుస్తూంది. లేక లలిత పుట్టిన రోజుకదా అని పంపించారేమో? ఎటూ తేల్చుకోలేక పోయాను.

ఆ మరుసటి దినంలో చాలాభాగం ఆఫీసులోనే సరిపోయింది. ఇదే నా మొదటి ఉద్యోగం అవటంవలన అంతా కొత్తగా ఉంది. డిప్లొమాలో చదివిన దానికీ, ఇక్కడి పనులకూ ఎక్కడా పొంతన కుదరడంలేదు. పని లో ఎక్కువ శ్రద్ధ చూపితేతప్ప, తొందరగా నేర్చుకునే అవకాశం కూడా ఉన్నట్టు నాకు కనబడలేదు. ప్లానులు గీయటం, మెజర్‌మెంటు బుక్కు లలో ఎంట్రీలు నింపటం మొదలయినవి నేర్చుకోవటం వీటితోనే సాయం కాలం వరకూ గడిచిపోయింది. ఆఫీసునుండి గదికి వచ్చేసరికి ఆరుంపావు అయింది. ముఖం కడుక్కుందామని పెరట్లో నూతివద్దకు వెళ్ళాను. ఆరిన బట్టలు తీసి మడతలు పెడుతోంది లలిత. నా ఉనికిని గమనించనట్లు తల వంచుకుని తన పని చూసుకుంటూంది.

ముఖం కడుక్కుని తువ్వాలుతో ఒత్తుకుంటూ, "నిన్న మీ రిచ్చిన కాఫీ చాలా బాగుంది" అన్నాను మెల్లగా.

లలిత నాకేసి చూసి, "అమ్మా!—" అంటూ గట్టిగా పిలిచింది.

నేను కాస్త కంగారు పడ్డాను.

"చూడండి...." అంటూ ఏదో సర్ది చెప్పబోయాను.

"ఏం తల్లీ!" అంటూ శేషమ్మగారు వంటింట్లోంచి పెరట్లోకి చక్కా వచ్చారు.

నా గుండెలు దడదడ కొట్టుకోవటం ప్రారంభించాయి.

"నువ్వు నిన్న కలిపిన కాఫీ చాలాబాగుందని మెచ్చుకుంటున్నారు కృష్ణ మూర్తిగారు." శేషమ్మగారితో విషయం చెప్పి, నా వంక చూసి నవ్వుతూ అంది లలిత.

"అమ్మ కాఫీ చాలాబాగా కలుపుతుందండీ."

నా గుండెలు కుదుటపడ్డాయి.

శేషమ్మగారు లలిత మాటలకు సంబరపడి నా వంకచూస్తూ "ఏదో నాయనా, మావి పల్లెటూరి కాఫీలు" అన్నారు.

నేను ముఖానికి వెర్రి నవ్వు ఒకటి పులుముకున్నాను.

"అబ్బే! అదేమిటండీ? నిన్న కాఫీ చాలా బాగుంది" అన్నాను. ఆవిడముఖం చాటంత చేసుకుని వంటింట్లోకి వెళ్ళిపోయారు.

లలిత కొంటెగా నా వంకచూస్తూ బట్టలు మడత పెడుతూంది.

ఇక సంభాషణ పొడిగించకుండా నా గదిలోకి వచ్చేశాను.

మస్తాను చెప్పినట్లు జానకి రామయ్యగారు నోట్లో నాలికలేని మనిషేమో కాని, లలిత మాత్రం కాదు. ఆమె నాలిక చాలా పదునయినది. కాని, అవసరం లేకుండా ఉపయోగించదని మాత్రం నాకు అర్థమైంది.

* * * *

సుమారు నెల దినాలు గడిచిపోయాయి.

ఆఫీసువర్కుచాలావరకూ నేర్చుకుని దానికి బాగా అలవాటు పడిపోయాను. మా సెక్షను వర్కు చివరి దశకు రావటంవలన పగలూ, రాత్రీ ఫీల్డులోనే గడిచిపోయింది.

కాంక్రీటు పనిదగ్గర రాత్రి తెల్లవారులూ ఉండటం, పగలు కొంత సేపు నిద్ర, వర్కును గురించిన ప్రోగ్రెసురిపోర్టులు తయారుచేయటం గుంటూరుకు డివిజన్ ఆఫీసు పనులమీద తిరగటం— వీటి మధ్య బొత్తిగా

తీరిక తగ్గిపోయింది. ఆరోగ్యం కూడా కొంత దెబ్బతింది. అయితే, ఉద్యోగంలో చేరి నెల దినాలే కావటం వలన సెలవుపెట్టే సాహసం చేయలేకపోయాను.

ఈ నెల దినాలలోనూ జానకిరామయ్యగారితో నా సాన్నిహిత్యం కొంతవరకు పెరిగింది. ఆఫీసుకు వెళ్ళేటప్పుడూ, వచ్చేటప్పుడూ పలుకరించేవాడు. సాగర్ నీరు వస్తే ఆ చుట్టుప్రక్కల పొలాలకు భూములకు ఏవిధంగా ఉపయోగపడతాయో వివరాలు అడిగి తెలుసుకునేవారు. రాత్రి వీధి వరండాలో పడుకున్నప్పుడు గడిచిన జీవితంలోని ఆయన అనుభవాలను గుర్తుకు తెచ్చుకుని నాకు తమాషాగా చెప్పేవారు.

రిటైరవ్వక ముందు ఆయన ఆ ఊరి స్కూలులో ఉపాధ్యాయుడుగా పనిచేసేవారట. కొద్దిపాటి ఆస్తిపాస్తు లుండటంవలన, ఒక్కతే కూతురు కావటంవలన రిటైరయ్యాక కష్టపడకుండా వీధి వరండాలో పడకకుర్చీలో నడుంవాల్చి మూడు పక్కలు, ఆరు చుట్టలు క్రింద కాలం గడుపుకొస్తున్నారాయన.

ఆదిశేషమ్మగారు అద్దె పాతిక రూపాయలతోబాటు ఇంకో మూడు రూపాయలు కరెంటుకు అదనంగా చెల్లించాలని షరతు పెట్టి అదికూడా నా వద్దనుండి వసూలు చేశారు. మధ్యమధ్యలో ఆవిడ నోటి ప్రభావం మస్తాను మీద, జానకిరామయ్యగారి మీద పడటం చూస్తూనే ఉన్నాను. అదేం అదృష్టమో చెప్పలేను కాని, నామీద ఆవిడ వాత్సల్య భావాన్నే చూపించేవారు. ఆవిడ వాగ్ధాటి నామీద చూపించే అవకాశం నిజానికి నేను కలుగనివ్వలేదు.

నేను వారింట్లో దిగిన పదిరోజుల్లోనే లలిత ఊరికివెళ్ళిపోయింది. రాజమండ్రిలోని వాళ్ళ చిన్నాన్న గారింటికి వెళ్ళిందని తెలుసుకున్నాను. ఎప్పుడయినా నూతివద్దో లేకపోతే మొక్కలకు నీళ్ళు పోస్తున్నప్పుడో

లలితను పలుకరించేవాడిని. కాని, మామధ్య పరిచయం పది రోజుల్లోనూ పెద్దగా పెరగలేదు.

ఒక దినం డివిజన్ ఆఫీసు పనిమీద గుంటూరువెళుతుంటేఆదిశేషమ్మగారు నా వద్దకు వచ్చారు

"నాయనా! గుంటూరు వెళుతున్నావా?" అన్నారు.

"అవునండీ" అన్నాను.

"బాబూ! ఒక్క సాయం చేస్తావా?" అన్నారు.

"చెప్పండి"

"గుంటూరు నుండి మా అమ్మాయికి టెలిగ్రాం ఇచ్చిపెడుదూ? వెంటనే బయలుదేరి రమ్మని ఇవ్వాలి" అంటూ అయిదు రూపాయలనోటు రాజమండ్రిలో లలిత ఉంటున్న చిరునామా నాకు అందించారు.

"తప్పకుండా ఇస్తాను" అంటూ వాటిని తీసుకున్నాను.

లలిత ఇక్కడికొచ్చేస్తుందంటే నాకు ఆనందంగానే ఉంది.

"అమ్మాయికి పెళ్ళివారొస్తున్నారు" అంటూనవ్విందావిడ.

నవ్వుతూ వుంటే ఆవిడ కళ్ళు ముడుచుకుని మరీచిన్నవయ్యాయి

"ఈ సంగతి అందులో రాయకు సుమీ!" అంటూ వెళ్ళిపోయారు.

లలితకు పెళ్ళివారు వస్తున్నారంటే మనసునిండా నిర్వచించలేని అవ్యక్తమైన దిగులు నిండిపోయింది. ఆమెతో నాకు నిజానికి ఎక్కువ స్వస్థత ఏర్పడలేదు. కాని, ఎందుకో లలితను పరాయి మగాడి సరసన ఊహించటానికి నాకు మనస్కొప్పలేదు. లలితను నేను అభిమానిస్తున్నానన్న సంగతి మొదటిసారిగా ఆవేళ నాకు అవగాహనకు వచ్చింది. ఈ అభిమానం ఏర్పడడానికి ప్రత్యేకమైన కారణాలు అంటూ ఏమీ నాకు కనిపించలేదు. కేవలం ఆమె అందాన్ని బట్టే అభిమానిస్తున్నానేమో? వయసు విసిరిన మైకం కూడా కొంతవరకూ కారణం కావచ్చు. వీటన్నింటినీ ప్రేమ అనుకుంటే—లలితను నేను ప్రేమిస్తున్నానేమో కూడా.

శేషమ్మగారు వెళ్ళిపోతూ, ఆ విషయం అందులో రాయకుసుమీ" అంటూ నాకు చేసిన హెచ్చరిక జ్ఞాపకానికి వచ్చింది. "ఎందుకు రాయకూడదు చెప్మా?" అనుకున్నాను.

"బహుశః లలితకు వివాహం చేసుకోవటం ఇష్టం లేదేమో? ఆమె ఎవరినయినా ప్రేమిస్తూందేమో? ఆ "ఎవరో" నేనే ఎందుకు కాకూడదు?"

ఏవేవో వెర్రి ఆలోచనలు మనసును ఆక్రమించుకున్నాయి. మా పదిరోజుల పరిచయంలోనూ ఇద్దరం ప్రేమించుకోవటానికి దారితీసిన బలమయిన సంఘటనలు ఏమీ జరగకపోయినా, ఆమె ఎడలకల ఆకర్షణ బలపడి ఇటువంటి ఆలోచనలవైపు మనస్సును తరుముతున్నట్టనిపించింది.

"రాబోయే ఆ సంబంధానికి లలిత ఒప్పుకోకుండా ఉంటే బాగుండును" అనుకున్నాను. ఇలా ఎందుకనుకున్నానంటే— ఆ వచ్చేవాడికి లలిత నచ్చకపోవటమంటూ ఉండదు!" అంత ఆకర్షణ వుంది ఆమెలో.

ఈ విషయం గురించి చాలాసేపు తర్కించుకొని లేచి, గది తలుపులకు తాళం బిగించి, గుంటూరు వెళ్ళటానికి రోడ్డుమీదకు వచ్చాను.

బస్సుకోసం నిరీక్షిస్తూ నిలబడ్డాను. ఇంకా తొమ్మిదిగంటలు కూడా కాలేదు. ఎండమాత్రం బాగా తీక్షణమైపోయింది ఇంతలో గుంటూరునుంచి ఒంగోలువయిపు వెళ్ళే బస్సువచ్చి ఆగింది. అందులోంచి లలిత దిగింది. ఆమెనుచూసి వెంటనే పోల్చుకోలేకపోయాను. ముందుగా ఆమే చిరునవ్వుతో "బాగున్నారా?" అంటూ పలుకరించింది.

లలితలో ఈకొద్ది దినాల్లో వచ్చిన మార్పుకి ఆశ్చర్యపోయాను. మనిషి కాస్త ఒళ్ళు చేసినట్టనిపించింది. మధ్యపాపిట మార్చి కాస్త పక్కకు దువ్వింది. పక్కలకు జారిన జుత్తు చెవుల్ని కప్పేస్తున్నాయి. అల్లరి చేస్తూ కమ్ముకున్న కురులమధ్యనుండి చెవులకున్న ముత్యాల డ్రాప్స్

ఒదిగి ఒదిగి చూస్తున్నాయి. రాజమండ్రి వెళ్ళాక ఫాషనుమార్చిందికాబోలు చీర బొడ్డుక్రిందకు కట్టింది. నిశ్చయంగా తేల్చిచెప్పలేని చాలా మార్పులు కనిపించాయి లలితలో.

"ఏమిటి మరీ అంత వింతగా చూస్తున్నారు? నేను లలితను...." మాటలు ఆపి మూతి సున్నలా బిగించి చిరునవ్వుతూంది

నా ప్రవర్తనకు సిగ్గు పడ్డాను. "మీరు చాలా మారిపోయారు" అన్నాను.

"నేను మారిపోయానా! చాల్లెండి— ఎవరయినా వింటే నవ్వుతారు" అంది.

"మీ అమ్మగారు మీ రింకా రాలేదని గాభరా పడుతున్నారు. మీకు టెలిగ్రామ్ ఇమ్మన్నారు" అంటూ జేబులోని చిరునామా కాగితం తీసి చూపించాను.

"టెలిగ్రామ్ ఎందుకు?" గాభరాగా అడిగింది లలిత.

"అట్బే విశేషమేమీ లేదులెండి. అనవసరంగా గాభరా పడకండి. ఆవిడకు మిమ్మల్ని చూడాలనిపించినట్లుంది అంతే!" అన్నాను.

"సరే నే వస్తాను" అంటూ సూట్ కేస్ కూలీ చేతికి అందించింది. వెళ్ళిపోతున్న లలితవంకే చూస్తూ గుంటూరువైపు వెళుతున్న బస్సును చెయ్యెత్తి ఆపటంకూడా మరచిపోయాను.

ఆ దినం పని పూర్తి అవకపోవటం వలన రాత్రికి గుంటూరు ఆఫీసులోనే ఉండిపోయాను. మరుసటి దినం సిమెంటు తీసుకొని లారీల కెక్కించి నేను ముందుగా వచ్చేశాను. గోడౌను శుభ్రం చేయించి, లారీల లోని సిమెంట్ దింపించి బస్తాలు పేర్పించి తాళాలు వేసుకొని నా గదికి వచ్చేసరికి సాయంకాలం ఆరుగంటలు దాటిపోయింది. అప్పుడే చిన్నగా చీకటి కూడా పడుతూంది. గది తలుపులు తెరిచిన శబ్దానికి లలిత లోపలి నుండి వచ్చింది.

"కొంచెం మంచినీళ్ళు ఇవ్వండి. ఈ దినం కూజాలో పోయించ లేదు" అన్నాను.

"కూజాలో పోయిస్తే నేనివ్వకూడ దేమిటి? ఇప్పుడే పట్టుకొస్తా నుండండి" అంటూ లోనికి వెళ్ళింది.

గదిలోకి వెళ్ళి లైటువేసి మంచంమీద కూలబడ్డాను.

కొద్ది సేపట్లో మంచినీళ్ళ చెంబుతో లలిత వచ్చింది.

చెంబు అందుకొని, "అలా కూర్చోండి" అంటూ కుర్చీ చూపించాను.

పుస్తకాలు రాక్ మీదకు వంగి ఒక పుస్తకాన్ని తీసుకొని కుర్చీలో కూలబడింది.

"ఇంట్లో అలికిడి లేదు. అమ్మగారు లేరా?" అన్నాను- అంటె కంటె సంభాషణ ఎలా ప్రారంభించాలో అర్థంకాక.

"లేదు. అమ్మ, నాన్నగారు కలసి కరణంగారి ఇంటికి వెళ్ళారు. వాళ్ళింట్లో ఈ దినంనుండి పురాణ కాలక్షేపం మొదలవుతుందట" అని కొంత సేపు ఆగి, "తొమ్మిదయితే గాని రారు" అంది.

"ఏమయినా కబుర్లు చెప్పండి" అన్నాను.

దీపం కాంతిలో ఆమె చెవికున్న ముత్యాల డ్రాప్స్ వింతగా మెరుస్తుంటే చూస్తున్నాను.

కబుర్లు నాకేం తెలుస్తాయి! మగాళ్ళు మీరే చెప్పాలి! .... అయినా అల్మారానిండా ఇన్ని పుస్తకాలు వుంచుకొని కబుర్లెందుకు మీకు? హాయిగా చదువుకోక!" పెద్ద ఆరిందాలా చెప్పింది లలిత.

"చదువుకోవటంలో వున్న ఆనందం వేరు! ఇలా కబుర్లు చెప్పుకోవటంలో ఉన్న ఆనందం వేరు.... మీరు పుస్తకాలు చదువుతారా?" అన్నాను.

"ఓ! పుస్తకాలుంటే నా కింకేం అక్కరలేదు."

"నాకు మీలాంటి స్నేహితులుంటే ఇంకేం అక్కరలేదు." అన్నాను.

నా మాటలకు లలిత కిలకిలా నవ్వింది. ఇంతకుముందుమల్లే ఆమె నావద్ద ముక్తసరిగా ఉండటంలేదు.

నాలాంటి స్నేహితులు మీకు ఎంతమంది ఉన్నారు?" నవ్వడం ఆపి కళ్ళు చక్రాల్లా తిప్పుతూ అడిగింది.

ఈ ప్రశ్నకు కాస్త తికమకపడ్డమాట వాస్తవం.

"పుస్తకాలయితే ఎన్నో ఉండాలి కాని మీలాంటి స్నేహితులు ఒక్కళ్ళయితే చాలరూ? ఎంతోమంది ఉండాలేమిటి?" మాటలు ఆపి ఆమె ముఖంలోకి తదేకంగా చూశాను.

కిటికీలోంచి వీస్తూన్న గాలికి ముంగురులు ఆమె ఫాలభాగం మీద అల్లరిగా గెంతులేస్తున్నాయి. కనుపాపల్ని చలాకీగా కదిలిస్తూ పుస్తకం లోని కాగితాలు తిరగేస్తూంది.

ఆమె ఏం మాట్లాడకపోయేసరికి రెండునిముషాలు ఆగి అడిగాను. "ఎవరి పుస్తకాలంటే మీ కిష్టం?"

"కొంపదీసి నన్ను ఇంటర్వ్యూ చేస్తున్నారేంటీమి?" అంది.

నాకు సమాధానం చెప్పటానికి అవకాశం చిక్కింది. "నేనెందుకు చేస్తాను? ఇంటర్వ్యూ చేసే పెద్దమనిషి రేపో ఎల్లుండో వస్తున్నాడుగా!" అన్నాను.

లలిత తనకేమీ అర్థం కానట్లు అయోమయంగా నా వంక చూసింది.

"మిమ్మల్ని చూసుకోవటానికి పెళ్ళివారు వస్తున్నారట! మీ అమ్మ గారు చెప్పారు." ఈ ముక్క చెప్పాక నాకు జ్ఞాపకానికి వచ్చింది. ఈ విషయం లలితకు తెలియనివ్వద్దని శేషమ్మగారు చెప్పిన సంగతి.

"తీరా నోరు జారాక, చేసేదేం లేక ఊరుకున్నాను. ఈ మాట లతో ఆమె ముఖం కందగడ్డలా మారిపోయింది.

"అమ్మ మీతో ఈ విషయం ఎప్పుడు చెప్పింది?"

"నిన్న. అందుకే మీకు టెలిగ్రాం ఇమ్మన్నారు."

"అయితే, మీకీ విషయం తెలిసే నిన్న నాకు చెప్పలేదన్నమాట।" ఆమె పెదాలు కాస్త వణుకుతున్నాయి.

"రోడ్డుమీద చెబితే బాగుండదని ఊరుకున్నాను. అంతేకాని, మీ నుండి ఈ విషయం దాచాలని కాదు" అంటూ అబద్ధపు సంజాయిషీ ఇచ్చుకున్నాను.

ఆమె కొంతసేపు ఏమీ మాట్లాడలేదు. చేతిలో పుస్తకాల్ని రాక్‌లో ఉంచింది.

పెళ్ళివిషయం ఎత్తితే ఆమె ముఖం సిగ్గుతో ముడుచుకుంటుందనుకున్నాను. అలాటి చిహ్నాలేమీ ఆమె ముఖంలో కనబడ లేదు సరికదా, కోపం అలుముకొని ముఖమంతా ఎర్రగా మారింది.

రెండు నిమిషాలు గడిచాక అన్నాను— "ఏం పెళ్ళి చేసుకోవటం మీకు ఇష్టం లేదా?" ఆమెకు తెలియని ఆమె స్వంత విషయాన్ని నేను చెప్పటంవలన అప్పుడే ఆమెమీద ఏదో అధికారం నాకు వచ్చేసినట్టు అనుకొని, మరింత చొరవ తీసుకోగలిగాను.

"ఉండండి. కూర ముక్కలు కుంపటి మీద ఉన్నాయి. మాడిపోతాయేమో కలియబెట్టి వస్తాను" అంటూ గాభరాగా లేచి వెళ్ళిపోయింది.

సమాధానాలు చెప్పటంలోనే కాదు, చెకుప్పండా తప్పించుకోవటంలో కూడా లలితకు తెలివితేటలున్నాయి. తువ్వాలు భుజంమీద వేసుకొని పెరట్లోకి వెళ్ళి ముఖం కడుక్కొని వచ్చాను. బట్టలు మార్చుకొని లుంగీ కట్టుకొని కూర్చున్నాను.

ఇంట్లోంచి గిన్నెలు సర్దిన చప్పుడు వినిపిస్తూంది కానీ, ఎంతకీ లలిత రావటంమాత్రం కనిపించలేదు. వరండామీద మంచం వేసుకొని నడుం వాల్చాను. మేఘాల వెనక బరువుగా కదులుతున్న చంద్రుణ్ని, నీలాకాశంపై తాపడం చేసినట్టు మెరుస్తున్న చుక్కల్నీ చూస్తూ ఎంతసేపు గడిపానో తెలియదు.

దగ్గరలో మెల్లగా గాజుల చప్పుడు వినిపిస్తే గుమ్మం వయిపు చూశాను.

లలిత. చీర మార్చుకొని శుభ్రమయిన తెల్లచీర కట్టుకొనివచ్చింది. నేను పెరట్లోకివెళ్ళినపుడు చూసిన బొండుమల్లెలు ఇప్పు ఆమె వాల్జడలో నవ్వుతున్నాయి.

'బొండు మల్లెలంటే నాకు ప్రాణం. ఈ విషయం లలిత కెలా తెలిసిందో?!

"బొండు మల్లెలంటే నాకెంతో ఇష్టం!" ఆకాశం వంక చూస్తూ స్వగతంలా అన్నాను.

"బొండుమల్లెలన్నా, బోసిపాపాయి నవ్వులన్నా ఎవరికిష్టం ఉండదు?" సన్నగా నవ్వుతూ అంది లలిత.

క్షణంసేపు మాట్లాడలేదు.

లలిత ఇందాక వివాహంగురించి చెప్పకుండా దాటేసింది. ఇప్పుడు ఆమెను ఆ విషయం గురించి అడగాలి. ఎలా అడిగితే బాగుంటుందో ఆలోచిస్తూ మాటలు పేర్చుకుంటున్నాను.

లలిత గుమ్మం దగ్గరినుండి వరండా చివరకువచ్చి స్థంభానికి ఆనుకొని ఆకాశాన్ని చూస్తూ నిలబడింది. రివ్వునవేస్తున్న గాలికి పైట ఎగిరి పడుతూంది. ప్రాణం పోసుకున్న దేవతా ప్రతిమలా అనిపించింది ఆమె నాకు ఆ క్షణంలో. అడుగుదా మనుకున్న విషయాన్ని మరచి తన్మయత్వంతో ఆమె అందాన్ని చూస్తూ ఉండిపోయాను.

"మీరు బుచ్చిబాబు "చివరకు మిగిలేది" చదివారా?" నిశ్శబ్దాన్ని భంగ పరిచింది లలిత.

"చదివాను. ఒక మారు కాదు, చాలాసార్లు!"

"మీకా నవల నచ్చిందా?"

నచ్చకపోతే ఇన్ని సార్లెందుకు చదువుతాను?" ఎదురు ప్రశ్న వేశాను.

"అర్థమవక పోయినా చాలాసార్లు చదవచ్చుగా?" ఎగతాళిగా అంది.

"అర్థమవక పోవటానికి అది తెలుగేకదా? వేరే ఏభాషా కాదుగా!" అన్నాను ఆఖరున "గా" మీద ఆమెలాగే ఒత్తి పలుకుతూ.

"భాష వేరు, భావం వేరు!" అంది.

ఆమె తన వివాహం సంగతి చెప్పకుండా దాటెయ్యటానికి ఈ సంభాషణలోకి దింపినట్టు నా కనిపించింది.

"పోనీలెండి. భాష, భావం వీటి సంగతి నా కంతగా తెలియదు కాని, మీరు మాత్రం మీ పెళ్ళి సంగతి చెప్పకుండా దాటేశారు" అన్నాను నిష్ఠూరంగా.

"అందులో దాటెయ్యడానికి ఏముంది?" అంటూ ఏదో చెప్ప బోతూంది.

అంతలో గేటు తీసిన చప్పుడయింది.

జానకిరామయ్యగారు, శేషమ్మగారు పురాణం నుండి వచ్చేశారు. శేషమ్మగారు బిగ్గరగా భర్తతో ఏదో మాట్లాడుతూ లోనికి వస్తున్నారు. ఆవిడ నడుస్తూంటే కడప నాపరాళ్ళు భారంగా మూలుగుతున్నాయి.

"నేను మవునంగా కళ్ళు మూసుకుని నిద్ర నటిస్తూ ఉండి పోయాను.

"ఇంత ఆలస్యం అయిందేం అమ్మా!" లలిత అడుగుతూంది.

అయ్యో తల్లీ! ముందుగా వచ్చేశాం, రేపటినుండి తొమ్మిదింటి వరకూ చెబుతారట. కృష్ణమూర్తిగారు అప్పుడే నిద్రపోయారే!" అంటూ లోనికి వెళ్ళిపోయారు శేషమ్మగారు.

ముసలాయన ఏదో అంటున్నారు. కాని, లోనికి వెళ్ళిపోవటం వలన వాళ్ళ మాటలు నాకు ఇకసరిగా వినబడటంలేదు.

వీధి తలుపు గడియ పెట్టిన చప్పుడు వినిపించాక మెల్లగా కనులు తెరచాను.

బహుశః లలిత నాతో ఏదో చెప్పాలనే వచ్చి ఉంటుంది. సరిగా ఆమె చెప్పే వేళకు తలిదండ్రులు రావటం వలన ఆ అవకాశం కాస్తా జారిపోయింది.

రేపు సాయంకాలం ఏదోవిధంగా లలితతో మాటలు కలిపి ఆమెకు వివాహమంటే ఇష్టం ఉందో, లేదో తెలుసుకోవాలి. లలితలో అందానికీ, తెలివి తేటలకూ లోటులేదు. చలాకీగా కబుర్లు చెపుతుంది. అన్నింటికీ మించి అందమయిన మనసుంది.

అయితే, నేనంటే ఇష్టమో,కాదో, ఎలా తెలుసుకోవటం? సూటిగా ప్రశ్నిస్తే లలిత సమాధానం చెప్పదు. అనవసరంగా కంగారుపడితే ఆమె తప్పుగా అర్థం చేసుకునే అవకాశం కూడా ఉంది. ఇంకా కొంత స్నేహం బలపడిన తరవాత ఈ విషయం కదిపితే మంచిదేమో ననిపించింది.

కాని, ఈలోగా ఆ చూడటానికి వచ్చేవాడుకాస్తా లలితను తన్నుకు పోతే? రాబోయే పెళ్ళి కొడుకు నా ఊహలమధ్య రావణాసురుడిలా కనుపించాడు. ఎటూ నిర్ణయించుకోలేకపోయాను. చాలా సేపు ఆలోచనల మధ్య సతమతమయ్యాక నిద్రపట్టింది.

ఉదయం స్నానం ముగించుకొని నూతి దగ్గర నుండి వస్తున్నాను. నూతినుండి నా గదికి రావాలంటే ఇంట్లోంచి కాకుండా పక్క సందు లోంచి దారి ఉంది. లలిత ఉండే గది కిటికి ఆ సందు వైపే ఉంది. కాని ఇన్ని రోజుల్లోనూ ఒకటి రెండు మార్లు తప్ప ఆ కిటికీ తలుపులుఎప్పుడూ తెరచి ఉండటం నేను గమనించ లేదు. అదీ కాక నేను స్నానానికి వెళ్ళే టప్పుడు మూసి ఉన్న కిటికీ ఇప్పుడు తెరచే ఉంది. సరిగ్గా కిటికీవద్దకు వచ్చేసరికి— "ఇదిగో.... మిమ్మల్నే అంటూ మెల్లగా లలిత కంఠం వినిపించింది.

పక్కకు చూశాను.

ఏదో రహస్యం చెప్పబోతున్న దానికి పక్కే కిటికీ వద్ద నిలబడి ఉంది లలిత. బుజంమీద తువ్వాలు సర్దుకుంటూ "ఏమి" అన్నట్లు ఆమె వంక చూశాను.

"సాయంకాలం ఎక్కడికీ వెళ్ళకండి. మీతో కొంచెం మాట్లాడాలి!" మెల్లగా అంది. ఆమె మాటంనిండా అభ్యర్థన.

"అలాగే నన్నట్టు తల ఊపి గబగబా అడుగు లేసుకుంటూ గది లోకి వచ్చేశాను.

"లలిత నాతో ఏం మాట్లాడదలుచుకుంది చెప్మా?" ఆలోచనకు ఈ విషయం అందకపోయినా మనసుమాత్రం ఆనందంతో గంతు లేస్తుంది.

సాయంకాలం ఎలాగయినా ఆమెతో మాట్లాడాలనుకున్నాను. హుషారుగా బట్టలు వేసుకుని ఆఫీసుకు బయలుదేరాను.

ఆఫీసులో ఆ వేళకి పనంతా మూడు గంటలకే ముగించుకున్నాను. బయలుదేరి రూముకు వచ్చేద్దామనుకునే సమయానికి ఆఫీసు ప్యూను కళ్యాణ సుందరం వచ్చాడు.

"ఏమిటోయ్?" అన్నాను హుషారుగా.

"మిమ్మల్ని అయ్యగారు రమ్మంటున్నారు." అన్నాడు.

ఎ.ఇ. గారి గదిలోకి వెళ్ళాను.

చూడండి! మేనేజర్ కెనాల్ లోని సైఫన్ వర్కు పూర్తయిందిగా ఇవిగో చెక్ మెజరుమెంట్సు. ఈ పుస్తకంలో ఉన్నాయి. ఇవి అర్జెంటుగా ఎమ్.బుక్.లో ఎక్కించి బిల్లు తయారు చేయండి" అన్నారు నన్ను చూస్తూనే.

నా ఉత్సాహం కాస్తా నీరుకారిపోయింది. ఎంత తొందరగా చేసినా అది మూడు గంటల పని. నీళ్ళనములుతూ నిలబడ్డాను.

ఎ.ఇ.గారు నాటకంలో తన డైలాగు ముగిసినట్లు మళ్ళీ ఫైలులో తల దూర్చారు.

"ఇప్పుడే చెయ్యాలా, సార్! అన్నాను చివరకు తెగించి.

"ఇప్పుడే చెయ్యాలండీ. ఆ కాంట్రాక్టరు మన ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు గారికి దగ్గర బంధువు. బిల్లు పైద సంతకాలు చేయించుకోవటానికి డివిజను ఆఫీసులో కూర్చున్నాడట! వెంటనే బిల్లు తయారుచేసి పంపించమని ఇ.ఇ.గారు కబురు పంపారు. మీరు తొందరగా రాస్తే నేను సంతకాలు చేస్తాను." సంతకాలు చేయటం ఓదో పెద్ద వీరోచిత కార్యంలా చెప్పాడాయన. "అవి పూర్తయిపోతే గుంటూరు పట్టుకెళ్ళి మీరే డివిజన్ ఆఫీసులో ఇచ్చి రావాలి. మీకోసం ఇ.ఇ.గారు ఎదురుచూస్తూ ఉంటారు" అంటూ ఫయిళ్ళమధ్య తల దూర్చాడాయన.

నాకు మతి పోయినట్లయింది. బిల్లు పూర్తిచేసి గుంటూరు తీసుకెళ్ళి ఇచ్చి వచ్చేసరికి రాత్రి పదవుతుంది. అయినా తప్పేదేముంది?

"అలాగే సార్!' అంటూ నీరసంగా ఆయన గదిలోంచి బయటపడ్డాడు. మనసు నిలవని పని చేయటంవలన రఫ్ బిల్లు అంతా తప్పుల తడికెలా తయారయింది. వాటిని దిద్ది బుక్కులో ఎక్కించి సంతకాలు పెట్టించేసరికి సాయంకాలం ఆరున్నర అయిపోయింది. ఆదరాబాదరాగా పుస్తకాలు పట్టుకొని గుంటూరు బయలుదేరాను.

గుంటూరులో నా పని ముగించుకుని తిరిగి వచ్చేసరికి రాత్రి పన్నెండున్నర అయింది. బట్టలు మార్చుకొని లైట్ బల్బు వెలిగించాను. పక్కమీద వాలినా నిద్రమాత్రం రావటంలేదు. "లలిత ఒకవేళ నాకోసం ఇంకా ఎదురు చూస్తూందేమో?" అన్న ఆలోచన వచ్చాక అసలు కన్ను మూతబడలేదు. మెల్లగా గదిలోంచి బయటకు వచ్చాను. బయట వెన్నెల పలచగా ఉంది. వరండా మెట్లు దిగి సందువైపు నడిచాను.

లలిత గది కిటికీలోంచి దీపంవెలుగు సందు గోడమీద పడుతూ వుంది నాకు ఆత్రత హెచ్చింది. మెల్లగా శబ్దం కాకుండా కిటికీ వద్దకునడి

చాను. కిటికీ తలుపులు బార్లా తెరిచే ఉన్నాయి. లోపల పెద్దదీపం వెలుగుతూంది. గుండెలమీద ఏదో పుస్తకం పెట్టుకుని నిశ్చింతగా నిద్రపోతూంది లలిత.

"లలితను నిద్ర లేపితే?" ఆ ఆలోచన నాకే భయం కలిగించింది. "కొంపదీసి నన్ను దొంగ అనుకొని అరిస్తే?" అంతా రసాభాస అవుతుంది. అయినా అవసరం ఆమెది. నాబెట్టు నే నెందుకు వదులుకోవాలి?

మెల్లగా వెనక్కి వచ్చేశాను.

సందు మొదలు నుండి వరండావైపు తిరుగుతూ ఉంటే గేటు తెరిచిన చప్పుడు వినిపించింది. అటు చూశాను.

మస్తాను లోనికి వస్తున్నాడు.

"ఇంతరాత్రివేళ తెలిగేసి ఉన్నారేమిటి, సాబ్?" అన్నాడు.

"అబ్బే, ఏంలేదు. ఇప్పుడే గుంటూరు నుండి వచ్చాను. ముఖం, కాళ్ళు కడుక్కుందామని నూతి దగ్గరకు బయలుదేరాను. తీరా టార్చిలైటు మరిచిపోయాను. అందుకు వెనక్కి వచ్చాను" అన్నాడు తడబడుతూ.

"పేటకిపోయి నాగేశ్వరరావు బొమ్మ చూసొస్తున్నా సామీ! శానా బాగుండాదిలే! నేనుపోయి నీళ్ళు తోడుకొస్తానుగాని మీరుండండి!" అంటూ సందువైపు వెళ్ళాడు.

కొద్దిసేపట్లోనే నీళ్ళతోడి పట్టుకొచ్చాడు.

"లలితమ్మగారు ఇంకా మెలకువగానే ఉండారే! ఇప్పుడే లైటు అర్పి పడుకొంటున్నారు." అని నావైపు చూసి నవ్వాడు.

నేను విస్తుపోయాను.

మస్తాను మాటలకు బహుశ లలితకు మెలకువ వచ్చి ఉంటుంది. పెద్దలైటు వుండిపోయిందని ఆర్పెయ్యటానికి లేచి వుంటుంది. అదిచూసి మస్తాను ఇంత సేపూ లలిత మెలకువగా ఉందనే అనుకుంటున్నాడు. పైగా

నేను సందువై పునుండి వస్తూండగా చూశాడు. మస్తాను ఏమని ఊహించు కుంటున్నాడో? మౌనంగా ముఖం కడుక్కొని గదిలోకి వెళ్ళిపోయాడు.

* * *

మరునాడు ఉదయం మెలకువ వచ్చేసరికి చాలాఆలస్యం అయింది. పళ్ళు తోముకుంటూ ఉంటే కంట్రాక్టరు కనకయ్యే వచ్చాడు. ఈ రోజు అతని బ్రిడ్జివర్కు ఉంది. ఆ సంగతి కనకయ్య వచ్చేవరకూ నాకు జ్ఞాపకమేలేదు. "తొందరగా బట్టలు వేసుకుని తయారవండి, సార్! నేను వెళ్ళి ఎ.ఇ. గారిని తీసుకొస్తాను" అంటూ జీప్ డ్రయివ్ చేసుకుని వెళ్ళి పోయాడు.

ఆదరాబాదరాగా ముఖం కడుక్కొని బట్టలు వేసుకుని తయార య్యాను. మస్తాను ప్లాస్కులో కాఫీ పోయించుకొని వచ్చాడు. కాఫీ తాగు తూంటే జీపు వచ్చింది. హడావుడిగా జీపులో ఎక్కాను.

బ్రిడ్జికి సగం "లే అవుటు" గీసి సున్నం పోయించి తవ్వటానికి సిద్ధంచేసేసరికి మధ్యాహ్నం పన్నెండు గంటలయింది. కనకయ్య జీపు మీదే మాకు భోజనాలు వచ్చేశాయి. ఎ.ఇ.గారు సుష్టుగా భోజనం కానిచ్చి చింతచెట్టు క్రింద జీపు సీటు తలగడా అమర్చుకొని నడుం వాల్చారు. ఆయన స్థితి చూస్తే సాయంకాలం వరకూ అక్కడనుండి బయలుదేరే సూచనలేమీ నాకు కనుపించలేదు.

"ఏం సార్, మనం బయలుదేరుదామా?" అన్నాను.

"రెండో సగం కూడా కొలతలు వేసి సున్నం చేయించేద్దాం. ముందుగా మట్టిపని అయిపోతే మళ్ళీ కాంక్రీటు పోసేవరకూ మనం ఇక్క డకు రావలసిన పని ఉండదు" అన్నారు.

రెండో సగంకూడా కొలతలు కొలిచేసిరికి సాయంకాలం ఆరు దాటిపోయింది.

"భోజనంచేసి రూముకు వెళ్ళండి, సార్!" అంటూ కనకయ్య నన్ను జీపులో తీసుకొచ్చి ఊర్లో దింపాడు. జీపు దిగేసరికి ఒళ్ళంతా

నొప్పులు ప్రారంభమయ్యాయి. తల భారంగా వుంది. భోజనం చేయాలనిపించలేదు. కాఫీ తాగి రూముకు వచ్చేశాను.

వరండామీద మంచం వాల్చుకొని పడుకున్నాను.

కొద్దిసేపట్లో లోపలినుండి ఆదిశేషమ్మగారి కంఠస్వరం బిగ్గరగా వినిపించింది. "నెత్తిమీద ఇరవై ఏళ్ళు వస్తున్నా, ఇంకా పెళ్ళి వద్దంటావేమిటే? నీ ఈడు వాళ్ళందరూ నిక్షేపంలా కాపరం చేసుకుంటూ గంపెడు పిల్లల్ని కన్నారు. ఈ కాస్త శుభమూ జరిపించేస్తే మా నెత్తిమీద భారం కూడా తగ్గుతుంది. ఇలా ఎంతకాలం మొరడులా కూర్చుంటావు?"

"నాకు అప్పుడే పెళ్ళి చేసుకోవాలని లేదు. నీకంత భారంగావుంటే చెప్పు. ఇంట్లోంచి వెళ్ళిపోయి ఎదయినా ఉద్యోగం చేసుకొని బ్రతుకుతాను." లలిత కంఠం చిన్నగా వినిపించింది.

"బాగుంది తల్లీ! మనకు ఇహ అదొక్కటే తక్కువ. కాలేజీకి పంపి చదువు చెప్పించినందుకు ఇక మమ్మల్ని ఉద్యోగాలు చేసి నువ్వు పోషించాలి. అయినా నిన్ను అని ఏం లాభం? మీ నాన్నగారిని అనాలి."

ఆదిశేషమ్మగారు చిందులు తొక్కుతున్నారు.

లలిత కంఠం మళ్ళీ వినిపించలేదు.

శేషమ్మగారు మాత్రం ఉండీ ఉడిగీ ఏదో సణుగుతూనే ఉన్నారు. కొద్ది నిమిషాలకే నాకు నిద్ర పట్టేసింది.

* * *

మరునటి దినం మధ్యాహ్నం భోజనంచేసి వచ్చి వర్క్ ప్రోగ్రెస్ రిపోర్టులు తయారుచేస్తున్నాను. రోజు రోజుకూ పని ఒత్తిడి పెరిగిపోవటంవలన విశ్రాంతి దొరకడం కష్టమైపోతూంది. అదీకాక మా సబ్-డివిజన్‌కు కొత్తగా కట్టబోయే ఆఫీసు బిల్డింగు పని కూడా నాకేతగిలింది. బిల్డింగు ప్లానులు ఎస్టిమేట్లు—ఇవన్నీ టేబిలుమీద ఫైళ్ళ ఎత్తును పెంచుతున్నాయి.

వ్రాతపని ఆపి బద్ధకంగా పడక కుర్చీలో నడుం వాల్చాను. కిటికీ లోనుండి వేడిగాలి లోనికి వస్తూంది. అవతల మునగచెట్టు మీద రెండు కాకులు తెగ గోల చేస్తున్నాయి.

ఇంతలో మెల్లగా తలుపులు తెరచిన శబ్దం అయింది. అటు వైపు చూశాను. తలుపు అవతల లలిత.

"లోపలకు రండి!" అన్నాను.

తలుపులు దగ్గరగా వేసి లోపలికి వచ్చి మంచంమీద కూర్చుంది. లేత నీలంరంగు వాయిల్ చీర, పింక్ కలరు జాకెట్టు, పైట జారిపోకుండా కాబోలు భుజంమీద చిన్న పిన్ను పెట్టింది. ఎంత తెలివితక్కువ చీర అయినా అంత అందమయిన వక్షాన్ని వదిలి జారిపోతుందా? ఎప్పుడో ఉదయం వేసుకున్న జడ కాబోలు ముంగురులన్నీ చెదిరి ఉన్నాయి.

"మీరు నాకు ఒక సహాయం చేయాలి." ఆత్రంగా నా ముఖంలోకి చూస్తూ అడిగింది లలిత.

"చెప్పండి. తప్పకుండా చేస్తాను" అంటూ హామీ ఇచ్చాను.

"మొన్నటినుండి ఈ విషయం మీతో చెపుదామనుకుంటున్నాను. కాని మీరు ఏ అర్ధరాత్రికో రూముకు రావటం వలన అవకాశం చిక్కటం లేదు."

"అవును. ఈమధ్య పని విపరీతంగా పెరిగిపోయింది. అందువలన ఖాళీ దొరకటంలేదు. ఆ సాయంకాలం మీరు నన్ను గదిలో ఉండమన్నారు. కాని కుదరలేదు!" సంజాయిషి చెప్పుకున్నాను.

తరువాత కొంతసేపు నిశ్శబ్దం మామధ్య చోటు చేసుకుంది.

"మీరు నన్ను ప్రేమించాలి!" నిశ్శబ్దాన్ని లలిత కంఠం చీల్చింది.

త్రుళ్ళిపడ్డాను. తల ఎత్తి సూటిగా లలిత కళ్ళలోకి చూశాను.

ఆమె కనుపాపల నిండా స్వచ్ఛత.

ముఖంనిండా నిశ్చలత.

"ఏమిటి?" కాస్త తడబడ్డాను.

మనసులోని మధురమయిన ఊహలన్నీ నిజాలయి కనులముందు నర్తిస్తే కలిగినప్పటి ఆనందం, ఉత్సాహం నన్ను కొంత సేపు సమాధానం చెప్పనీయకుండా అడ్డుపడ్డాయి.

నేను మాట్లాడకుండా కొంత సేపు ఉండిపోయేసరికి మళ్ళీ లలితే అంది. "నాకు ఇప్పుడు ఒక ఆపద వచ్చిపడింది. నన్ను చూసుకోవటానికి ఎల్లుండి పెళ్ళివారు వస్తున్నారని మీకు తెలుసుగా? ఎలాగయినా ఆ సంబంధం ఖాయంచేసి అమ్మ నాకు పెళ్ళి చేసేద్దామని చూస్తోంది" మాటలు ఆపి దీర్ఘంగా ఊపిరి పీల్చుకుంది.

నేను మూగవాడిలా లలిత చెప్పింది వింటూ ఆమె అందం వైపే కన్నార్పకుండా చూస్తూ ఉండిపోయాను. మాట్లాడదామనుకుంటే పదాలే కరువయ్యాయి.

"కానీ, నాకీ సంబంధం ఇష్టంలేదు. అది తప్పించాలంటే మీరు నన్ను ప్రేమిస్తున్నట్లు ఆ వచ్చే ఆయనతో చెప్పాలి. ఈ విషయం ఇంకెవరికీ తెలియనీయకండి! ఈసాయం మీరు చేస్తారని నాకు నమ్మకం ఉంది.

లలిత ధైర్యానికి నాకు మతి పోతూంది.

నేను ఎలాగూ సహాయం చేస్తాను. లలిత సులువుగానే ఊహించగలదు.

"ఈ సాయం మీరు చేస్తారని నాకు నమ్మకం ఉంది" అంటూ మాటలతో నన్ను కట్టి పడేసింది.

"నా మెదడు చకచకాపనిచేయటం ప్రారంభించింది. ఈ సహాయం లలితకు చేయటానికే నిశ్చయించుకున్నాను. ఎందుకంటే ఆమె వ్యక్తిగత విషయాలలో కొంత దగ్గరకు వచ్చాను కనుక, ఆమెకు ఈ సహాయం చేస్తున్నాను కనుక, ఆమెపై కొంతవరకూ అధికారం చెలాయించే హక్కు నేను పొందుతాను.

నా అభిప్రాయాన్ని ఆమెకు తెలియజేయటానికి ఈ సహాయం నా బాటను కొంతవరకు సుగమం చేస్తుంది.

"మీకు తప్పకుండా సహాయం చేస్తాను. మీరీ విషయంలో ధైర్యంగా వుండండి" కురుక్షేత్ర సంగ్రామ సమయంలో అర్జునుడికి ధైర్యం చెప్తున్న శ్రీకృష్ణునికిమల్లే చాలా నిశ్చలంగా చెప్పాను.

"మీరు చెస్తారని నాకు తెలుసు. మరి నేను వెళ్తాను. అమ్మ నిద్ర లేస్తుందేమో?" అంటూ లేచి తలుపులు తెరచుకొని వెళ్ళిపోయింది.

నేను పడక్కుర్చీలో వెనక్కువాలి ఆలోచిస్తూ ఉండిపోయాను.

* * *

లలితను చూడటానికి వచ్చినాయన పేరు ప్రసాదరావు. మనిషి అందంగానే వున్నాడు. మరీ అంత పొడుగరికాకపోయినా రీవిగావున్నాడు. నుదుటిమీద అంగుళం మేర కాలిన మచ్చమాత్రం అతని అందాన్నికొంత వరకూ తగ్గించివేసింది.

పెళ్ళి చూపులకు ఆయనొక్కడే వచ్చాడు. ఆయనకు కాఫీ, టిఫెనులు ఇవ్వటానికి శేషమ్మగారికి నేను సహాయం చేశాను.

ప్రసాదరావు విశాఖపట్నంలో అమెరికన్ కంపెనీలో పనిచేస్తున్నాడట! సుమారు తొమ్మిది వందలవరకూ జీతం వస్తుందట. "పైన ఏమాత్రం దొరుకుతుంది?" అని శేషమ్మగారడిగిన ప్రశ్నకు సమాధానంగా చిరునవ్వు నవ్వి "మాది ప్రయివేటు కంపెనీ, గవర్నమెంటు కంపెనీ కాదండీ!" అన్నాడు.

జానకిరామయ్యగారు ఏవో ప్రశ్నలు వేయబోయారు కాని, అన్నిటికీ ఆదిశేషమ్మగారు అడ్డుపడుతూనే ఉన్నారు. కొంతసేపయ్యాక శేషమ్మగారు ఇంట్లోకి వెళ్ళి లలితను తీసుకొచ్చారు.

చిలకాకుపచ్చ రంగు పట్టుచీరలో ధగధగా మెరిసిపోతోంది లలిత. మెడలో పలకసర్లు, చంద్రహారం జిగజిగలాడుతున్నాయి. జుట్టు నొక్కుదువ్వి జడనిండా కనకాంబరాలు పెట్టుకుంది! ఈ అలంకరణ లలిత

అందాన్ని కొంతవరకూ మింగేసినట్లు అనిపించింది నాకు. బహుశా శేషమ్మగారు బలవంతంచేసి నగలన్నీ ఆమె మెడలో దిగేసి ఉంటారు.

లలిత మెల్లగా గదిలోకి వచ్చింది. సోఫా పక్కనుండి వస్తూ కాలు జారి తూలి పడబోయి నన్ను పట్టుకుని నిలదొక్కుకుంది. అనుకోకుండా నేను రెండు చేతులతో ఆమెభుజాలు పట్టుకున్నాను "ఏమిటిది?" అన్నాను ఆత్రంగా.

"అబ్బే ఏంలేదు కాలు జారింది" అని సుతారంగా అడుగులువేస్తూ గది మధ్యలో వేసిన తివాసీమీద కూర్చుంది.

ప్రసాదరావు ఏవో ఒకటి రెండు ప్రశ్నలు ఆమెను అడిగాడు.

మెల్లగా వాటికి సమాధానం చెప్పింది లలిత. అయితే, లలితకు అడ్డుపడుతూ ప్రతిదానికీ వివరణ ఇస్తూ శేషమ్మగారే సమాధానాలు చెప్పారని అనటం న్యాయం! శేషమ్మగారి వాగ్ధోరణి ప్రసాదరావుకి నచ్చినట్లు లేదు. ఆమె మాట్లాడతూ వుంటే చికాకు పడుతూ విన్నాడేమోనని నా అనుమానం మొత్తం మీద పెళ్ళి చూపుల తతంగం పూర్తయింది. ప్రసాదరావు లలితను ఎక్కువగా ప్రశ్నించకపోయినా వచ్చినప్పటినుంచి వెళ్ళేవరకూ లలిత అందాన్ని త్రాగేస్తున్నట్టు చూశాడని నా కనిపించింది.

అతడు బయలుదేరుతూ "ఇంకోవారం దినాలలో మా నాన్నగారి చేత ఉత్తరం వ్రాయిస్తాను" అన్నాడు.

"పదండి స్టాండు వరకూ నేనూ వస్తాను" అంటూ ప్రసాదరావును దిగవిడిచే నెపంతో నేనూ అతనితో బయలుదేరాను.

ఇల్లు దాటి రోడ్డు మలుపు తిరిగాం. ఇద్దరం మౌనంగానే నడుస్తున్నాం. నేను చెప్పవలసిన విషయం ఎలా ఆరంభించాలో తెలియక తికమక పడుతున్నాను. ఆఖరికి గొంతు పెగల్చుకొని "మీకో విషయం చెప్పాలి" అన్నాను.

ప్రసాదరావు జేబులోంచి సిగరెట్టు పెట్టె తీసి నాకు ఆఫర్ చేశాడు.

"థాంక్స్ అలవాటు లేదు!" అన్నాను.

"అదృష్టవంతులు!" అంటూ తనొకటి తీసి ముట్టించాడు. పొగ గట్టిగాపీల్చి వదులుతూ "చెప్పండి" అన్నాడు.

మరి కొంత సేపు మాట్లాడలేదు.

మీకీ విషయం ఎలా చెప్పాలో అర్థం కావటంలేదు నసుగుతూ అన్నాను.

"ఎలాటి విషయమైనా ఫరవాలేదు, చెప్పండి. వినటానికి సిద్ధంగా వున్నాను" అంటూ అభయ మిచ్చాడు.

నేను ఇంకా మాటలకోసం తడుముకొంటున్నాను.

అంతలో ప్రసాదరావుగంభీరంగాఅన్నాడ. మీరులలితను ప్రేమిస్తు న్నారు! అవునా?"

నా పక్కనే బాంబు పేలినట్లయింది!

ప్రసాదరావు దేవాంతకుడు. ఆవలించకుండానే "మీకు ఇన్ని పేగు లున్నాయి, సార్!" అని చెప్పెయ్యగల సమర్థుడు.

నాకు మతి పోయినట్లయింది. కాని నేను అతని తెలివితేటలకు జోహార్లనదలచలేదు.

"అబ్బే, అదేంకాదు!" అన్నాను తడబాటుతో.

నేను వేసుకున్న పథకమంతా తలక్రిందయిపోతున్నట్లు అని పించింది.

"లలిత నన్ను కోరిందేమిటి? ఆఖరికి నేను చేస్తున్నదేమిటి?"

"మరి మీరు చెప్పదలుచుకున విషయమేమిటి?" సూటిగా నా కళ్ళ లోకి చూస్తూ ప్రశ్నించాడు ప్రసాదరావు.

"అవును, ఏమిటి?"

"నేను చెప్పదలచుకున్న విషయాన్నే ప్రసాదరావు సూచిస్తే

అంగీకరించలేకపోయాను. అదే విషయాన్ని ఇప్పుడు నేను చెబితే అతడు నన్నొక వెర్రివాజమ్మగా జమకట్టే అవకాశం లేకపోలేదు. అయినా ఏం చేయటం?

"నేను లలితను ప్రేమిస్తున్నానని ఎలా అనుకున్నారు?" అన్నాను గొంతు పెగల్చుకుంటూ.

ప్రసాదరావు గట్టిగా నవ్వేశాడు.

నా అప్రయోజకత్వాన్ని ఎత్తి చూపిస్తున్నట్టుంది ఆ నవ్వు.

"వెరీ సింపుల్, మాస్టారూ! అంత అందమయిన అమ్మాయిని పక్క గదిలో పెట్టుకుని ప్రేమించకుండా ఎవడయినా ఉండిపోతే వాడొట్టి ఫూల్ అన్నమాట! మీరు ప్రేమిస్తున్న అమ్మాయి జోలికి నేను రావటం న్యాయంకాదు. మీకే ఆ ఛాన్సు వదిలేస్తున్నాను. గ్రంథం జాగ్రత్తగా నడిపించండి" అన్నాడు సిగరెట్ పారేస్తూ.

ప్రసాదరావు మీద తిరుగులేని దెబ్బ కొట్టాడు.

ఈ లోకంలో నేనూ, జానకిరామయ్యగారూ తప్ప అందరూ తెలివిగా మాట్లాడే వాళ్ళలాగే కనిపించారు. రెండు నిమిషాల్లో బస్‌స్టాండ్ చేరుకున్నాం.

"రండి కోకోకోలా తాగుదాం" అంటూ పక్కనున్న కిళ్ళీషాపుకు తీసుకు వెళ్ళాను. సగం త్రాగుతూ ఉంటే గుంటూరు వెళ్ళే బస్సు వచ్చేసింది. ప్రసాదరావు ఎక్కేశాడు. కిటికీవద్ద కూర్చుని బస్సు కదులుతూ వుంటే- "విష్ యు గుడ్‌లక్ మేస్టారూ!" అంటూ చెయ్యి వూపాడు. నేనూ చెయ్యి వూపుతూ రెండు నిమిషాలు అలాగే నిలబడిపోయాను. బస్ వూరిచివరి మలుపు తిరిగి కనుమరుగైపోయింది. కాళ్ళీడ్చుకొంటూ ఇంటికి వచ్చేశాను.

ఆ సాయంకాలం అంతా గదిలోనే వున్నాను. ఏదో సమయంలో లలిత నా గదికి వస్తుందేమోనని ఎదురు చూశాను. ఒకటి రెండుసార్లు వంటరిగా వీధి వరండాలోకి వచ్చినా నేను పలుకరించబోయేసరికి లోప

లికి వెళ్ళిపోయింది. ఎంత విచిత్రంగా వుంటారీ ఆడవాళ్ళు అనిపించింది. లలిత మీద కోపం వచ్చిన మాట కూడా వాస్తవం.

* * *

మరునాడు ఉదయం మా సబ్ డివిజన్ ఆఫీసుకోసం కొత్తగా కట్టబోయే బిల్డింగు వివరాలు కొన్ని తీసుకు రావటానికి గుంటూరు డివిజన్ ఆఫీసుకు వెళ్ళాను. మధ్యాహ్నానికి పని ముగించుకొని మ్యాటినీ చూసి సాయంకాలం తిరిగి వచ్చాను.

లలిత వీధి వరండాలో కూర్చుని జాజిపూలు మాల కడుతూంది. మధ్యమధ్యలో చేమంతి ఆకులు వేసి వేళ్ళను అందంగా అతి వేగంగా కదిలిస్తూ పూలకూ, దారానికీ అంతులేని తీయని అనుబంధం కల్పిస్తూంది.

"రండి, మీకోసమే చూస్తున్నాను." మెట్లు ఎక్కుతూ ఉంటే, మాల కట్టడం ఆపి నావంక చూస్తూ అంది లలిత.

"ఏం? మళ్లీ నాఅవసరం ఏదైనా వచ్చి పడిందా?" కాస్తకటువుగానే అన్నాను.

మూతి బిగించి నా ముఖంలోకి చూసింది. తరవాత బిగ్గరగా నవ్వేసింది.

"మీకు కోపం కూడా వస్తుందే!" అంటూ మళ్ళీ మాల కట్టడం ఆరంభించింది.

మాట్లాడకుండా రూము తలుపుతీసి లోనికి వెళ్ళిపోయాను. చేతిలోని ఫైళ్ళు టేబిలుమీద గిరాటేసి, కాలికున్న బూట్లు విప్పి పడేశాను. తువ్వాలు తీసుకొని ముఖం తుడుచుకుంటూ బయటకు వచ్చాను.

బయట సన్నగా చీకట్లు ముసురుకుంటున్నాయి. ఋషి పక్షులు గుంపులు గుంపులుగా గూళ్ళకి తిరిగి వెళ్ళిపోతున్నాయి. గాలి వేడి తగ్గి కాస్త చల్లబడుతూంది.

"మంచినీళ్ళు కావాలా?" రెండు చేతుల్నీ వెనక్కి పెట్టి తలలో సుతారంగా పాయదీసి జాజిపూల మాలను తురుముకుంటూ అడిగింది.

"థాంక్స్! వద్దులెండి." కాస్త బెట్టుగానే అన్నాను. లలితే మెల్లగా నావద్దకు వచ్చింది.

జాజిపూల పరిమళం నన్ను ఒక్కసారిగా ఉక్కిరి బిక్కిరి చేసింది.

"బాగా అలిసిపోయినట్టున్నారు. కాస్త నెస్‌కేఫ్ కలిపి తీసుకురానా ఆమె గొంతునిండా అందమయిన మార్దవం. సూటిగా ఆమె కళ్ళలోకి చుశాను. కళ్ళనిండా అర్ద్రత.

"ఒక్క క్షణంలో తీసుకొస్తాను. కూర్చోండి!" అంటూ నా సమాధానానికి ఎదురుచూడకుండా లోనికి వెళ్ళిపోయింది.

తువ్వాలు భుజం మీద వేసుకుని మెట్లు దిగి ఎదుట ఆవరణలోకి వచ్చాను. గాబులోని నీళ్ళతో ముఖం కడుక్కుంటున్నాను. ఇంతలో పచ్చి గడ్డిమోపు ఎత్తుకుని మస్తాను వచ్చాడు. "ఉదయం నుండి కనబడలేదేం సామీ?" అన్నాడు.

"గుంటూరు వెళ్ళాను."

"మీరింటికి వచ్చినాక ఓసారి ఆఫీసుకు రమ్మని మీ అయ్యగారు కళ్యాణ సుందరం చేత కబురంపారు." అన్నాడు

"అలాగే వెళతానులే" అంటూ ముఖం తుడుచుకుని వరండా మీద కొచ్చి స్తంభానికి ఆనుకొని పై మెట్టు మీద కూలబడ్డాను.

గడ్డిమోపు తీసుకుని పెరట్లోకి వెళ్ళిపోయాడు మస్తాను.

చీకటి బాగా ముసురుకుంది.

వరండాలో లైటు వెలిగితే తల ఎత్తి చూశాను.

లలిత కాఫీ కప్పుతో నిలబడి ఉంది.

"ఇదిగో, తీసుకోండి" అంటూ అందించింది.

"థాంక్స్!" అంటూ కాఫీ కప్పు అందుకొని, "లైటార్పెయ్యకూడదూ?" అన్నాను.

"ఏం? ఎందుకు?" లలిత అడిగింది.

"కళ్ళు మంటలుగా ఉన్నాయి, లైటు ఆర్పితే కాస్త చల్లగా ఉంటుం దేమోనని!"

లలిత లైటు ఆర్పి వచ్చి మెట్లకు ఆవలి చిగురున వరండా మీద కూర్చుంది. కాఫీ తాగటం ముగించి కప్పు పక్కన పెట్టాను.

రెండుక్షణాల తరవాత లలిత అంది- మీరు మాటిమాటికీ నాకు థాంక్స్ చెప్పటం ఏమీ బాగాలేదు...."

"ఏం? ఎందుకని? అవతలి వాళ్ళనుండి సహాయం పొందాక మాట మాత్రంగా నయినా కృతజ్ఞత తెలియ జేయటం కనీసధర్మం అనుకుంటాను అన్నాను.

"అయితే, ఒక వెయ్యిథాంక్స్ మూటకట్టి ఇవ్వండి. కావలసినప్పు డల్లా ఒక్కొక్కటీవాడుకుంటూ ఉంటాను" నవ్వుతూ అంది.

సమాధానంగా నే నేం మాట్లాడలేదు.

"నిన్న మీరు నాకు చేసిన సాయం ఏ నాటికీ మరచి పోలేను. సాయంకాలం మీతో మాట్లాడలేదని మీకు నామీద కోపం వచ్చిందికదూ! నేనేం మాట్లాడక పోయేసరికి ఆమే అంది.

"నా కెందుకుకోపం? అయినా జరిగిన విషయం మీతో చెప్పాలని ప్రయత్నించాను కాని, కుదరలేదు." సీరియస్‌గా అన్నాను.

"అమ్మ మనమీద అనవసరంగా అనుమానపడుతుందని తప్పించు చుకు తిరిగాను. అయినా, మీరు ఆ కార్యాన్ని నెరవేర్చ గలరని నాకు నమ్మకం వుంది."

లలిత తన వాక్చాతుర్యంతో నన్ను ఆక్రమించేసుకుంటూంది. ఆమెను ఇక మెట్లు ఎక్కించి పైకి వెళ్ళనివ్వకూడదనుకున్నాను. అందుకే చిన్న అబద్ధం ఆడాను.

"లలితా! నిన్న జరిగిందేమిటో తెలుసా?"

"ఏమిటి?" లలిత మామూలుగానే అడిగింది. ఆమె గొంతులో నే నాశించిన ఆత్రం ధ్వనించలేదు.

ప్రసాదరావు మిమ్మల్ని ఎలాగయినా పెళ్ళాడదలచుకున్నాడు. నేనేం చెప్పినా ఆయన నమ్మలేదు.

లలిత సన్నగా నవ్వింది. ఒక క్షణం పోయాక అంది: "మీకు అబద్ధాలు ఆడటం చేతకాదు."

"అవును!.... చేతకాదు! అందుకే నిజం చెబుతున్నాను." కాస్త కఠినంగానే అన్నాను.

"కృష్ణా!.... కొత్తరకమయిన ఈ సంబోధన లలిత నోటి ద్వారా వినడం ఇదే ప్రథమం.

"కృష్ణా! మీరు చెబుతున్నది పచ్చి అబద్ధం. ప్రసాదరావు నన్ను చేసుకోరు!!"

"అలా అని మీరు ఎందుకనుకుంటున్నారు" అడిగాను.

నిన్న నేను గదిలోకి వస్తూ తూలిబడబోతే మీరు గట్టిగా పట్టుకున్నారు. గుర్తుందా?"

"అవును. పొరపాటున పడబోతే పట్టుకున్నాను."

అప్పుడు ప్రసాదరావు కన్నుల్లో ఈర్ష్యను స్పష్టంగా చూడగలిగాను" అంది.

"మరీ ఎక్కువగా ఆలోచిస్తున్నావు నువ్వు అన్నాను.

"నిజానికి నేను కాలుజారి పడలేదు." కొంటెగా అంది.

"మరి?" ఆశ్చర్యంగా అడిగాను.

కావాలనే పడ్డాను. నేను కావాలని పడినట్లు ప్రసాదరావుకూడా అర్థం చేసుకున్నాడు. అదీకాక నేను ఉన్నంతసేపూ మీవైపే చూస్తూ ఉండి పోయాను. మీరు గమనించలేదేమో కాని, ప్రసాదరావు మాత్రం చూపులు మార్చి ఈ సంగతి గమనిస్తూనే ఉన్నాడు. ఆయన కన్నుల్లో మీ మీద మెదలిన ఈర్ష్యని సులువుగా చదవగలిగాను. మనదేశంలోని ఏ సగటు యువకుడికయినా అంతకంటె ఎక్కువ సంస్కారం ఊహించలేదు. అం

దుకే— మీరు చెప్పిన వెంటనే ఆయన నమ్ముతాడని చెపుతున్నాను."
మాట్లాడడం ఆపింది లలిత.

ఊపిరాడని గదిలో బంధించినట్టుంది నా పరిస్థితి.

లలిత తెలివితేటలకు ఆశ్చర్యపోయాను.

"చిన్నయ్యగోరూ... ..." అన్న పిలుపు విని గేటు వయిపు చూశాను.

ఆఫీసు ప్యూన్ కళ్యాణసుందరం.

"లోపలికి రా" అన్నాను.

లలిత లేచి లోపలికివెళ్ళిపోయింది.

'పెద్దయ్యగోరు మిమ్మల్ని రమ్మంటున్నారు సార్! ఇందాక ఒక పర్యాయం వచ్చాను— మస్తాను మీకు కబురు చెప్పలేదూ?" అన్నాడు.

"ఇప్పుడే గుంటూరునుండి వచ్చాను. అయిదు నిమిషాలు రెస్టు తీసుకొని వద్దామనుకుంటున్నాను. ఊం! ఏమిటి హడావుడి?" అన్నాను.

"మధ్యాహ్నం సిమెంటు స్టాకు వచ్చింది. గోడౌను తాళాలు మీ దగ్గర ఉండిపోయినాయటగా?"

అప్పుడు గుర్తు వచ్చింది తాళాలు నావద్ద ఉండిపోయినట్టు గుంటూరు వెళ్ళేటప్పుడు ఎ.ఇ. గారికి ఇచ్చి వెళదామనుకుంటూనే మరచి పోయాను.

"వస్తున్నాను పద!" అంటూ లేచి రూములోకి వెళ్ళి చెప్పులు తొడుక్కుని బయటకు వచ్చాను.

రూముకు తాళంవేసి ఆఫీసుకు బయలుదేరాను.

* * *

వారం దినాలు గడిచిపోయాయి.

ఒకదినం రాత్రి జానకిరామయ్యగారు అన్నారు, ఆ కుర్రాడి తండ్రి దగ్గరనుండి ఉత్తరం వచ్చిందండోయ్!

"ఏమని?" ఆత్రంగా అడిగాను.

"కుర్రాడికి పిల్ల నచ్చిందట!" జానకిరామయ్యగారు మాట్లాడ్డం ఆపి దీర్ఘంగా నిట్టూర్చాడు.

"ఆఁ!" అన్నాను ఆశ్చర్యంగా,

"అదేమిటి? అలా ఆశ్చర్యపడుతున్నావు?" అన్నారు.

నేను చేసిన తప్పుకి మనసులోనే నొచ్చుకున్నాను.

అబ్బే! ఏదో ఆలోచిస్తున్నాను వెరీగుడ్! పిల్ల నచ్చిందన్నమాట! ముహూర్తం సంగతి రాశారా?"

"కుర్రాడికి పిల్ల నచ్చినంతలో సరిపోయిందా! వాళ్ళడిగే కట్నం మనం ఇచ్చుకోవద్దూ? పాతికవేలు కావాలిట. మాటలు ఆపి ఊపిరి పీల్చుకొని, అంత డబ్బు మనం ఎక్కడినుంచి తేగలం?" — ఇక ఈ సంబంధం వీగిపోయినట్టే అన్నారు.

ఆయన కంఠంనిండా ఆవేదన ధ్వనించింది.

నాకు మాత్రం మనసులో పెద్దదిగులు తీరినట్లయింది. అయితే నాకొక సమస్య మాత్రం మిగిలిపోయింది. లలిత ప్రేమ విష్ యూ గుడ్‌లక్ అంటూ నన్ను ప్రోత్సహించిన ప్రసాదరావు పిల్ల నచ్చిందని ఎలా వ్రాయించాడో మాత్రం అర్థం కాలేదు.

ఏది ఏమయినా సంబంధం తప్పిపోయిందన్న విషయం నా కెక్కువ ఆనందాన్ని మిగిల్చింది.

ఆ మరునాడు ఆఫీసులో ఉండగా నాన్నగారి దగ్గరినుండి ఒక కవరు వచ్చింది. నాన్నగారి ఉత్తరంతోపాటు ఒక "ఎప్పాయింటుమెంటు ఆర్డరు-ఇంతకుముందు వెళ్ళిన రైల్వే ఇంటర్వ్యూ తాలూకు ఫలితంఅది. పాట్నా సెక్షన్‌లో ఉద్యోగం వచ్చింది. పది రోజులలోగా వచ్చి చేరిపొమ్మని ఉంది.

జీతం ఎక్కువ- మంచి ఉద్యోగం.

నా ఉద్దేశం వ్రాయమని నాన్నగారు వ్రాశారు.

ఈ ఉద్యోగానికి రాజీనామా చేసి పాట్నా వెళ్ళి చేరిపోవటానికి

నిశ్చయం చేసుకొన్నాను. అదే ఉద్దేశ్యం వెంటనే ఇంటికి వ్రాసి పడేశాను.

రాజీనామా ఉత్తరం వ్రాసి ఎ.ఇ.గారికి ఇచ్చాను.

తొందరగా రిలీఫ్ కావటంకోసం ఆ దినమే దాన్ని గుంటూరు తీసుకువెళ్ళి సర్కిల్ ఆఫీసులో ఇచ్చాను.

ఆ రాత్రికి గుంటూరులో ఉండిపోయి మరుసటిదినం నా పని ముగించుకొని తిరిగి వచ్చాను.

గదిలో ఉన్న ఫయిళ్ళు, ఇతర ఆఫీసు సామాన్లు ఏ.ఇ.గారికి పంపేశాను. నా పని పూర్తిఅయ్యేసరికి నాలుగయింది. ఇక రెండు, మూడు దినాలలో నాకు రిలీవరు వస్తాడు. వచ్చిన వెంటనే నేను బయలుదేరి పాట్నా వెళ్ళిపోవాలి.

ఈ రాత్రి ఎలాగయినా నా మనసులోనిమాట లలితకు చెప్పెయ్యాలనుకున్నాను. ఆమె వివాహానికి అంగీకరిస్తే ఆ విషయం ఇంటికి తెలియజేయటానికి నిశ్చయించుకున్నాను. సామాన్లు సర్దుతూవుంటే మస్తాన్ వచ్చి గుమ్మందగ్గర నిలబడ్డారు. "ఏంటిసామీ, అన్నీ చక్కబెడుతున్నారు? కేంపు వెళతారా?" అన్నాడు.

"లేదోయ్! రైల్వేలో వుద్యోగం వచ్చింది. వెళ్ళిపోతున్నాను."

"ఏంది? ఇక్కడ వుద్యోగం మానేస్తరా?" అన్నాడు ఆశ్చర్యంగా.

అవునన్నట్టు తల ఊపాను.

"అదేమిటి సామీ! అంతపని చేస్తరు!" అన్నాడు.

నేను వెళ్ళిపోవడం వాడి కంత నచ్చినట్టులేదు.

"ఏం?" నేను వెళ్ళొద్దా చెప్పు?" అన్నాను నవ్వుతూ.

"నేను వద్దంటే మానేస్తారేటి? లలితమ్మగారు చెపితే మానేస్తారు కానీ....

మస్తానువైపు చూశాను.

వాడి కళ్ళలో నిశ్చలత-చదవలేని భావాలు.

"ఏం లలిత చెపితే ఎందుకు మానేస్తాను?" అన్నాను.

"అదేమో? నా కట్టా అనిపించింది. అంతే!" అంటూ వెళ్ళి పోయాడు.

నేను ఉద్యోగం మానేసిన సంగతి నేరుకా వెళ్ళి ఆదిశేషమ్మ గారితో చెప్పినట్లన్నాడు. ఆవిడ చేస్తున్నపని ఆపి చేతిలో గరిటతో సహా చక్కా వచ్చింది.

"అదేమిటి బాబూ! వుద్యోగం మానేసి వెళ్ళిపోతున్నావా ?" అంది.

అవునన్నట్టు తల పంకించాను. వివరాలన్నీ చెప్పాను.

నేను వెళ్ళిపోతున్నందుకు ఆవిడెంతో బాధపడింది.

"లలిత ఇంట్లో లేదా?" అన్నాను చొరవగా.

"లేదు నాయినా, నిన్న మధ్యాహ్నం రాజమండ్రి వెళ్ళింది. మళ్ళీ మూడుదినాల్లో వస్తుంది కాలేజీలో ఏవో సర్టిఫికెట్లు వుండిపోయాయని, అవి తెచ్చుకోవటంకోసం వెళ్ళింది.

నా గుండెల్లో రాయి పడింది.

నేను రెండు మూడుదినాలో వెళ్ళిపోవాలి.

ఈలోగా లలిత వస్తుందో రాదో?

అయినా నేను చేయగలిగిందేమీ లేదు.

నేను వెళ్ళిపోతున్నానని నాతో పనిచేసే ఇతర సూపర్వైజర్లు, ఎ.ఇ. గారు కలసి నాకు ఒక చిన్న ఫేర్‌వెల్ పార్టీ ఎరేంజ్ చేశారు ఆ మరునాడు.

సాయంకాలం ఆఫీసుముందున్న ఖాళీ స్థలంలో కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ బిస్కెట్లు కాఫీలు ఆరగించాం. నేను మంచి వుద్యోగంలోకి వెళుతున్నందుకు అందరూ అభినందించారు.

ఆ రాత్రి జానకిరామయ్యగారితో చాలాసేపు మా ఇంటి వ్యవహా

రాలు,సంగతులు చెప్పాను. నా ఆర్థిక స్థితిగతులపరించి ఆయనతో మాట్లాడ్డం ఇదే మొదటిసారి లలిత ఎడల నాకున్న అభిమానాన్నికూడా పరోక్షంగా మాటలలో చెప్పాలని యత్నించాను.

రెండు దినాల తరవాత నాకు రిలీవరు ఇచ్చారు. ఆయనకు ఛార్జి అప్పచెప్పి ఆ రాత్రికే ప్రయాణం పెట్టుకున్నాను. మధ్యాహ్నం రెండు గంటలకు ఇంటిముందు రిక్షా ఆగింది. అందులోంచి సూట్ కేసుతో లలిత దిగింది.

నా సంతోషానికి అవధుల్లేవు. అప్రయత్నంగా వీధి వరండాలోనికొచ్చాను.

రిక్షా దిగి ఇంట్లోకి వస్తూ నా గదివంక చూసి ఆగిపోయింది.

పెట్టె, బెడ్డింగులు కనబడినట్లున్నాయి. "సామాన్లు సర్దారు. ఏదయినా క్యాంపువెళుతున్నారా?"

"లేదు. ఉద్యోగానికి రిజైను చేశాను. ఇక్కడినుండి వెళ్ళిపోతున్నాను." లలిత నా మాటలు నమ్మలేనట్లు రెండు క్షణాలు నా కన్నుల్లోకి చూసింది.

"నిజంగా!" అంది తరవాత కళ్ళు చక్రాల్లా తిప్పుతూ.

"నాకు అబద్ధాలు ఆడటం చేతకాదని నువ్వే చెప్పావుగా" అన్నాను.

"అలాగే" అంది కనురెప్పలు దించుకుంటూ.

లలిత గలగలా నవ్వేసింది.

లలితా! నేనురాత్రి తొమ్మిది గంటలకు వెళ్ళిపోతున్నాను. సాయంత్రం కొంచెం నీతో మాట్లాడాలి" అన్నాను.

"ఎక్కడ కలుద్దాం?" మెల్లగా అడిగాను.

ఈ మధ్య ఆదిశేషమ్మ దంపతులు పురాణానికివెళ్ళటంలేదు.అం... వలన ఇంటి దగ్గర ఎక్కువసేపు మాట్లాడుకోవటం కుదరదు

చెన్నకేశవస్వామి ఆలయం ఉందిగా! ఊరవతల సాయంకాలం! అక్కడికి వస్తాను" అంటూ ఇంట్లోకివెళ్ళిపోయింది.

నేను గదిలోకి వచ్చి లలితతో మాట్లాడే విషయంగురించి పథకం వేసుకుంటూ ఉండిపోయాను. ఈరాత్రి నేను విజయవాడనుంచి పాట్నాకు బయలుదేరాలి. పాట్నాలో నాకు తెలిసిన మిత్రుడొకడున్నాడు. అతనికి నేను వస్తున్నట్లు అప్పుడే టెలిగ్రాంకూడా ఇచ్చాను. అతడు నన్ను రిసీవ్ చేసుకునేందుకు స్టేషన్‌కువస్తాడు. కాబట్టి ఈ రాత్రికేబయలుదేరకతప్పదు. నేను వెళ్ళేలోగా లలితకు నేనంటే ఇష్టమో, లేదో తేల్చుకుంటే తరవాత మిగిలిన విషయాలు నిర్ణయించుకోవచ్చు.

*  *  *

సాయంకాలం బాగా చల్ల బడిపోయింది.

చెన్నకేశవస్వామి ఆలయమంటపంలో కూర్చుని లలిత రాకకు ఎదురు చూస్తున్నాను.

"బాబూ !" బొంగురు గొంతు విని తల వెనక్కి తిప్పి చూశాను.

ఆలయ పూజారి బోసి నవ్వుతో నావంక చూస్తున్నారు.

"స్వామి దర్శనం చేసుకుంటావా?" అన్నారు.

మాట్లాడకుండా పాదరక్షలు విడిచి లోనికివెళ్ళాను.

గర్భగుడిలో కాస్త చీకటిగా ఉన్నా, చెన్నకేశవుని ముందున్న మూనెదీపం ఆ చీకటిని పారద్రోలే యత్నంచేస్తూంది.

ముకుళిత హస్తుడయిన స్వామి విగ్రహం ముందు శిరస్సు వాల్చి కళ్ళు మూసుకున్నాను.

కనుల ఎదుటనుండి ఏవో వెలుగురేఖలు తీగెలుగా సాగి జారి పోతున్నట్లనిపించింది మనసును పునీతం చేస్తున్నట్లు గుడి గంటలు మోగాయి.

మెల్లగా కనులు విప్పి చూశాను.

నాకు కాస్త ఎండగా గర్భగుడి గడపకు దగ్గరగా నిలబడి వుంది లలిత. ఆమె చేతిలోని పూలసజ్జ, కొబ్బరికాయ అందుకుంటున్నారు.

పూజారి. నేను దైవసాన్నిధ్యమన్న సంగతే మరచి లలితను చూస్తూ వుండిపోయాను.

నెమలికంఠం రంగు పట్టుచీర నూనెదీపం కాంతిలో వింతగా మెరుస్తూంది. నుదుట నయాపైసంత కుంకుమబొట్టు. కనులకు రాసుకున్న కాటుక చిన్నగా సాగి కొలకుల నుండి విల్లులా వంపులు తిరిగింది. కనురెప్పలపైన ఒకటి రెండు స్వేద కిరణాలు నిలబడి చోద్యం చూస్తున్నాయి. అంత అందమైన కనురెప్పల నుండి జారిపోటం ఇష్టంలేక కాబోలు, అక్కడే పలుచగా పరుచుకుంటున్నాయి. మెడలోని లాకెట్ అందమయిన వక్షాన్ని వదల్లేక గుండెలమధ్య మెత్తగా ఒదిగిపోయింది.

పూజారి ప్రసాదాన్ని ఆమె చేతిలో వుంచుతూ "శీఘ్రమేవ కళ్యాణ ప్రాప్తిరస్తు" అంటూ ఆశీర్వదించారు. లలిత చిన్నగా నవ్వుకొంటూ కొబ్బరి చెక్కలోని నందివర్ధనాన్ని జడలో తురుముకొంది.

ఇద్దరం మెల్లగా బయటకు వచ్చేశాం. పూజారి గుడి తలుపులువేసి తాళాలు బిగించి వెళ్ళిపోయారు. గుడి వెనుక భాగంలో పెద్ద నూరు వరహాల చెట్టుంది. చెట్టు మొదట్లోని సిమెంటు చప్టామీద కూలబడ్డాను.

తియ్యని వాసనతో పూలన్నీ నేల రాలివున్నాయి.

నాకు కాస్త ఎడంగా లలిత కూర్చుంది. తల దించుకుని నూరువరహాలపూలు రెక్కలు తుంచి వెనక గొట్టానికి అమర్చి పువ్వుని ముద్దగా ముద్దుగా తయారుచేస్తూంది.

"లలితా!" అన్నాను.

ఇలా ఏకాంత ప్రదేశంలో లలితతో మాట్లాడ్డం ఇదే ప్రథమం. నాగొంతు వింతగా ధ్వనించింది.

"ఊఁ!" అంది లలిత తల ఎత్తకుండానే.

"నాకు రైల్వేలో ఉద్యోగం వచ్చింది. ఇంతకంటేమంచిఉద్యోగం. జీతం ఎక్కువ. అందుకే ఇక్కడ మానేసి పాట్నా వెళ్ళిపోవటానికి నిశ్చయం చేసుకున్నాను" అన్నాను.

లలిత ఏమీ మాట్లాడలేదు.

"మన పరిచయం కొద్ది నెలలదే అయినా, ఇద్దరం మానసికంగా బాగా దగ్గరకు వచ్చాం" అన్నాను.

"అవును" అంది లలిత.

నాకు ఏదో ఆవేశంగా చెప్పాలని వుంది. కాని మాట్లాడదామంటే భాష దొరకటంలేదు. భాషకు అందని భావాలు ఏవో గజిబిజిగా మెదడులో దొర్లుతున్నాయి.

'లలితా! నేను వెళ్ళిపోతున్నానంటే నీకు బాధగా లేదా!"

ఆ మాటలకు తల ఎత్తి నావంక చూసింది లలిత.

అందమైన ఆమె కనుకొలకుల్లో అస్పష్టంగా రెండు కన్నీటిబిందువులు జీరాడుతున్నాయి.

రుమాలుతో కనులు ఒత్తుకుంది.

వెంటనే చిన్నగా నవ్వేసింది. హోరున వర్షం కురిసి వెలిశాక ప్రకృతిమీద పరుచుకున్న నీరెండలాటి నవ్వు.

"మీరు వెళ్ళిపోవటం నాకు చాలా బాధగా వుంది. నేను వెళ్ళటం మానెయ్యమంటాను— మానేస్తారా?" బొటనవేలి చుట్టూ చీరచెంగు ముడేసుకుంటూ అంది.

"ఓ! మానేస్తాను" అన్నాను.

"భలేవారు మీరు! అంతమంచి వుద్యోగం మానేసి ఇక్కడ వుండి పొమ్మంటే వుండిపోతారా? వూరికే సరదాగా అన్నాను. మీకు ఎంతో భవిష్యత్తు వుంది. హాయిగా వెళ్ళి వుద్యోగం చేసుకోండి"

కొంతసేపు నిశ్శబ్దం మామధ్య రాజ్యమేలింది.

మసకచీకట్లు ముసురుకొంటున్నాయి.

తెల్లని నూరు వరహాల పూలు అప్పుడప్పుడు రాలి మాచుట్టుపడుతున్నాయి.

"లలితా! నేనంటే నీ కిష్టమేనా?"

లలిత సమాధానం చెప్పలేదు.

"ఏం లలితా? మాట్లాడవేం?" గోముగా అడిగాను.

"ఇష్టమే!" అంది మెల్లగా.

"అయితే మనిద్దరం పెళ్ళి చేసుకుందాం!" అన్నాను.

కింది పెదాన్ని పై పంటితో నొక్కిపట్టి మెల్లగా తలఎత్తి నావంక చూసింది.

"ఇష్టం వేరు. ప్రేమవేరు!" అంది గట్టిగా ఊపిరి పీలుస్తూ.

అర్థంకానట్లు ఆమెవంక చూశాను.

లలిత మవునంగా వుండిపోయింది.

"అయితే నీకు నామీద ప్రేమలేదా?"

ఈ ప్రశ్నకు కూడా లలిత సమాధానం చెప్పలేదు.

"ఆవేళ, నీ పెళ్ళిచూపులనాడు ప్రసాదరావుతో ఏమని చెప్పమన్నావో గుర్తుందా?" అన్నాను మళ్ళీ.

"గుర్తుంది. ఆ సంబంధాన్ని తప్పించుకునేందుకు అలా చెప్పమన్నాను."

"అయితే, నువ్వు నన్ను ప్రేమించటంలేదా లలితా?"

నా గొంతు నాకు తెలియకుండానే బొంగురుపోయింది. ఒడలంతా ఏదో నీరసం ఆవహించినట్లయింది.

"క్షమించండి కృష్ణా! నాకు కొంత గడువిస్తే ఈ విషయంగురించి మీకు సమాధానం చెప్పగలను. కాని, మీరు నన్ను అపార్థం చేసుకోవద్దు!" అంది.

"నాకు ఏం మాట్లాడాలో తోచలేదు. గుండెల్లో దిగులుగా వుంది.

లలిత ఒళ్ళో తలవాల్చి బావురుమని ఏడవాలని వుంది. ఏదో బేలతనం నన్నాక్రమించింది.

"నాకు తెలియకుండానే నేను లలితను ఇంతగా ప్రేమించానా?" అనిపించింది.

లలిత కుడిచేతిని నా రెండు చేతులలోకి తీసుకుని మృదువుగా నొక్కాను. ఆమె చేతివేళ్ళు నిప్పు కణికల్లా కాలిపోతున్నాయి. నా రెండు చేతులమధ్యా ఏవో జీవరాసులు ప్రాకుతున్నట్లు ఆమె చేతి నరాలలోని రక్తం కదలిక స్పష్టంగా తెలుస్తూంది.

"పదండి! ఇక వెళదాం!" అంటూ నా చేతుల మధ్యనుండి తన చేతిని సుతారంగా వదిలించుకుంటూ లేచి నిలబడింది. నేనూ లేచి నిలబడ్డాను.

"నీ నిర్ణయాన్ని పదిహేను రోజులలో నాకు రాస్తావుగా. ఇదిగో నా అడ్రసు. నేను నా మిత్రునితో వుంటాను. ఈ చిరునామాకు రాస్తే నాకు ఉత్తరం అందుతుంది" అంటూ జేబులోని అడ్రెసు కాగితాన్ని ఆమె కందించాను.

"తప్పకుండా రాస్తాను" అంటూ ఆమె కాగితాన్ని తీసుకుంది.

"నువ్వెళ్ళు లలితా. నేను కాస్సేపాగి వస్తాను" అన్నాను.

నా సందేహాన్ని గమనించినట్టుంది.

"మరేం ఫర్వాలేదు! ఇద్దరం కలిసే వెళదాం!" అంది.

ఇద్దరం మవునంగా నడిచి ఇల్లు చేరుకున్నాం.

వీధి వరండాలో ఆదిశేషమ్మగారు జానకిరామయ్యగారు కూర్చుని మాటాడుకుంటున్నారు. గేటు చప్పుడు విని ఇంతవరకు ఉండిపోయా వేమిటే అంటూ ఆదిశేషమ్మగారు లేచి నిలబడ్డారు.

"కోవెలనుండి మెల్లగా నడిచి వచ్చాం. కృష్ణమూర్తిగారు తోడు న్నారుకదా?" అంటూ లోనికి వెళ్ళిపోయింది.

నేను రూములోకి వెళ్ళబోతూంటే—"ఈ పూటకి మా ఇంట్లోనే భోజనం చెయ్యాలి" అన్నారు అదిశేషమ్మగారు.

"అబ్బే! ఎందుకండీ?" అంటూ తప్పించుకోబోయాను. కాని, ఆవిడ పట్టు వదలలేదు.

ఆ రాత్రి వారి ఇంట్లోనే భోజనం చేశాను. లలితే స్వయంగావడ్డించింది. బలవంతం చేసి రోజూకంటే ఎక్కువ తినిపించింది.

ఎనిమిదిన్నరకు రిక్షాలో సామాను ఎక్కించి ఇంట్లో అందరివద్దా సెలవు తీసుకుని బయలుదేరాను. రిక్షా సందు మలుపు తిరిగి ట్రంకు రోడ్ ఎక్కేవరకూ గేటు దగ్గర లలిత నిలబడి చూస్తూనే వుంది.

* * *

నేను "డిప్లొమా" మొదటి సంవత్సరం చదువుతూవుండగా "కెమిస్ట్రీ"లో "కెటలిస్ట్"ను గురించి చదివిన జ్ఞాపకం నాకింకా బాగా వుంది.

రెండు వేర్వేరు రకాల మూల పదార్థాలు కలిసి కొన్ని అనుకూల పరిస్థితులలో రసాయనిక పరిణామంచెంది ఒక కొత్త మిశ్రమంగా మారుతాయి. అయితే, ఈ రకమయిన మార్పుకి కొన్ని సమయాల్లో "కెటలిస్ట్" అవసర మవుతుంది. "కెటలిస్ట్" కేవలం తన ఉనికితో రెండు మూలకాల రూపాల్ని మార్చి కొత్తమిశ్రమం తయారుకావటానికి వుపకరిస్తుంది కాని, తానుమాత్రం ఏ విధమైన శాశ్వతమైన మార్పునూ పొందకుండా తన రూపంలోనే మిగిలిపోతుంది.

జీవితంలోని సంఘటనలు కొన్నింటిని ఈ రకమయిన మార్పులకు అన్వయించుకోవచ్చునని లలితనుంచి నాకు ఆ ఉత్తరం వచ్చాక అర్థమయింది.

స్త్రీ పురుషునికి అర్పించటానికి దాచుకొన ప్రేమ, పురుషుడు స్త్రీ పొందుకోసం పడే ఆరాటం—ఇవి రెండూ జీవన యాత్రలోని యౌవన కాలంలో వివాహ వ్యవస్థగా రూపొందుతా యనుకుంటాను.

లలిత చాలా తెలివయినది. అందులో సందేహమేమీ లేదు. తల్లి

గొంతుకకూ, తండ్రి మంచితనానికీ ఒదిగినట్లు కనిపించినా, తన ఇష్టా ఇష్టాలనుమాత్రం చంపుకొని వ్యవహరించలేదు. అందుకె అందమయిన లలిత ప్రేమకథకు నేను "కెటలిస్ట్"గా మాత్రమే మిగిలిపోయా నని పించింది.

లలిత రాజమండ్రి నుండి వ్రాసిన ఉత్తరం ఇది!

"కృష్ణా!

పిచ్చి గీతల్లా విడిపోయిన భావాలను పొదివి పట్టుకుని నన్ను క్షమిం చమని అర్థిస్తూ ఓకీ లేఖ ప్రారంభిస్తున్నాను. ఒక మంచిమనిషి జీవి తంతో చెలగాటం ఆడాననీ, ఒక సున్నితమయిన మనసును మభ్య పెట్టా నని నాకు తెలుసు. అయినా, ఏం చెయ్యను? నేను చాలా స్వార్థపరు రాల్ని

మీరు ఆ రాత్రి బయలుదేరి వెళ్ళిపోయారుకదూ? కొద్ది గంటల తరవాత ఆ రాత్రే నేనూ ఇంట్లోంచి పారిపోయి రాజమండ్రి వచ్చేశాను! పారిపోయి కాదు — మీతో లేచిపోయి వచ్చేశాను! గాభరా పడకండి. మీతో లేచిపోతున్నట్లు, కొంతకాలం వరకూ నాకోసం వెతకవద్దనీ, మళ్ళీ నేనే వస్తాననీ ఇంటిదగ్గర ఒక ఉత్తరం వ్రాసిపెట్టి ఇంట్లోంచి వచ్చే శాను.

చూశారా! నేనెంత స్వార్థపరురాలినో? మీరు వెళ్ళిపోయాక కూడా నా అవసరంకోసం మీ పేరు వాడుకున్నాను.

అమ్మకు, నాన్నగారికి మీమీద కొంత గౌరవం వుంది. మీతోవెళ్ళి పోయానంటే కొంతకాలం నన్ను వెదికే ప్రయత్నం చేయరు. ఈ రహ స్యాన్ని వాళ్ళే జాగ్రత్తగా కాపాడుతారు.

కాలం ఎంతటి గాయాన్నయినా మాన్పుతుందని నమ్మకం వుంది.

నేను చేసినపని కొంతకాలంపోయాక వెళ్ళి వాళ్ళకు చెపితే నన్ను క్షమిం చగలరన్న నమ్మకం నాకుంది.

ఇంతకూ అసలు విషయంమీకుచెప్పలేదుకదూమీ రుమావూరురాకముందు మాఇంట్లో మాధవరావుగారని ఒక సూపర్‌వైజర్ వుండేవారు. నేను కాలేజీ నుండి సెలవులకని ఇంట్లో కొచ్చినపుడు ఆయనతో స్నేహం ఏర్పడింది. మా స్నేహం అచిరకాలంలోనే విడదీయలేని బంధంగా మారింది. నేను ఆయన్ని ప్రేమించాను. నా సర్వస్వాన్నీ ఆయనకు అర్పించుకున్నాను. అయితే నాకూ, ఆయనకూ మధ్య కులవ్యవస్థ అడ్డుగోడగా నిలిచింది. మా ఇంటిలో ఈ వివాహానికి ఒప్పుకోరని నాకు తెలుసు. అయినా నా జీవిత భాగస్వామిని ఎన్నుకునే విషయంలో నేను ఆత్మవంచనకు పాల్పడదలచు కోలేదు.

కృష్ణా! మాధవరావుగారికి అందమయిన మనసుంది. నన్ను అమి తంగా ప్రేమిస్తున్నారు. కుల మేదయితేనేం గుణం వుండాలి కాని? మత మేదయితేనేం, మనసు వుండాలి కాని?

మేమిద్దరం రహస్యంగా వివాహం చేసుకుందామని ఒక నిశ్చయా నికి వచ్చాం. ఆ సమయంలో మాధవరావుగారికి రాజమండ్రి ట్రాన్సఫర యిపోయింది. చిన్నాన్నగారింటికి వెళ్ళాలనే నెపంతోనూ, కాలేజీ సర్టిఫి కెట్లకనీ తరుచు రాజమండ్రి వచ్చి ఆయన్ని కలుసుకునేదాన్ని.

ఈలోగా అమ్మ నాకోసం సంబంధాలు వెదకటం ప్రారంభించింది ఆ వచ్చిన సంబంధాన్ని తప్పించుకొనేందుకు మిమ్మల్ని సాధనంగా వాడు కున్నాను. అందుకు మన్నించండి.

మీరుకూడా ఊరు వదిలేస్తారని తెలియటంతో నకున్న ధైర్యం కాస్తా తగ్గిపోయింది. మీ సహాయంతో ఈ సమస్యను కొంతవరకూ నెగ్గుకు రాగలుగుతున్నాను. కాని, మీరు వెళ్ళిపోవటంతో ఆ ఆశ కూడా హరించిపోయింది. అందుకే మీరు వెళ్ళిన రాత్రే నేనూ రాజమండ్రి పారి పోయి వచ్చేశాను. ప్రస్తుతం వారితోనే వుంటున్నాను.

ఇంతకుముందే మా వివాహం గురించి రిజిస్ట్రారు ఆఫీసులో రిజి ష్టరు చేయించాం.

రేపే మా వివాహం.

నేను చేసేపనికి మీ ఆశీస్సులు సర్వదా ఉంటాయని విశ్వసిస్తు న్నాను. మీ సహాయానికి కృతజ్ఞురాల్ని.

క్షమించమని మరో మారు అర్థిస్తూ....

—స్నేహితురాలు లలిత"

(15-8-73 ఆంధ్రప్రభ)